మాకో.. ఛాన్స్‌..ప్లీజ్‌!



సమావేశ ప్రాంగణం వద్ద మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొలుసు పార్థసారథి, పరిశీలకులు ఎంఎస్‌రాజు, నాగ జగదీశ్, ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి

'పార్టీ కోసం మాస్థాయిలో మేము కష్టపడి పనిచేశాం. జిల్లా అధ్యక్ష పదవికి మా పేరు కూడా పరిశీలించండి. ఇన్నాళ్లు పార్టీని నమ్ముకొని విశ్వాసంతో ఉన్నాం. కష్టమొచ్చినా.. నష్టమొచ్చినా సరే పార్టీని వీడే ప్రయత్నం చేయలేదు. చంద్రబాబు నాయకత్వంలోనే కలిసికట్టుగా పనిచేశాం. ఇకముందు ఇదే బాటలో వెళతాం.' పార్టీ పరిశీలకుల ఎదుట డజన్ల సంఖ్యలో నేతల వేడుకోలు ఇది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- అధ్యక్ష స్థానం కోసం పోటాపోటీ
- గన్నితో సహా రేసులో పది మంది
- తొలి ఐదుగురి పేర్లతో అధిష్ఠానానికి నివేదన
- పార్టీ పరిశీలకుల ఎదుట కేడర్‌ జోరు
- అనుబంధ సంఘాల్లో చోటు కోసం దరఖాస్తులు

ఏలూరులోని క్రాంతి కల్యాణ మండపంలో ఆదివారం టీడీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ప్రత్యేకించి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడి ఎంపికపై నేతలు, కార్యకర్తల అభిప్రాయాలను స్వీకరించారు. అధ్యక్ష స్థానంతో పాటు అనుబంధ సంఘాల్లోను తమకు ప్రత్యేక స్థానం ఇవ్వాల్సిందిగా డజన్ల సంఖ్యలో వినతులు పరిశీలకులకు అందాయి. సుమారు రెండు గంటలకు పైగా సాగిన సమావేశంలో అధ్యక్ష పదవిని ఆశిస్తూ పలువురు దర ఖాస్తు అందజేశారు. ఇప్పటికే అధ్యక్ష స్థానంలో ఉన్న గన్ని వీరాంజనేయులు సైతం పార్టీ ఆదేశమే తమకు శిరోధార్య మని ప్రకటించారు. ప్రత్యేకించి దెందులూరు సీనియర్‌ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ తనకు ఆ పదవి అవసరం లేదని, కానీ నియోజకవర్గస్థాయిలో తాము ఎదుర్కొంటున్న కష్టాలు అన్నీఇన్నీ కావని నిర్మోహటంగా ప్రకటించారు. కొన్ని వలసపక్షులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా యని, వీరి పట్ల మంత్రులుగానీ, సీనియర్లుగానీ ఏ రకమైన చర్య తీసుకోవడం లేదని, ఆఖరికి జిల్లా కమిటీ సైతం ఇదేం పట్టనట్టుగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కమిటీ దగ్గర్నుంచి మిగతా వాటి విషయంలో నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తనకు ఆమోదయోగ్యమేనని వెల్లడించారు. దీనికి తోడు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఆశిస్తూ మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, తెలుగుదేశం అధికార ప్రతినిధి శ్యామ్‌చంద్రశేషు, పెనుమర్తి రామ్‌కుమార్, శీలం వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, నూజివీడు నియోజక వర్గానికి చెందిన అట్లూరి రమేశ్‌ ప్రత్యక్షంగానే పరిశీలకుల ఎదుట తమకున్న శక్తి,యుక్తుల్ని ప్రస్తావిస్తూనే తమకు ఒక అవకాశం ఇచ్చి చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇంకోవైపు చాలామంది జిల్లా అధ్యక్ష స్థానం కోసం పోటీ పడుతు న్నారని తాను ఆ రేసులో లేనని, ఒకవేళ పార్టీ ఆదేశిస్తే బాధ్యతలను భుజానెత్తుకోవడానికి తాను సిద్ధమేనని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తన అభిప్రాయాన్ని తెలిపారు. 'పార్టీలో ఎవరు ఉండాలి.. ఎవరు ఉండకూడదనేది (మిగతా 8వ పేజీలో)



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా



పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు

పార్టీ ఆదేశానుసారమే అభిప్రాయ సేకరణ

పార్టీ ఆదేశం మేరకే కేడర్‌ అభిప్రాయ సేకరణకు తాము ఇక్కడకు వచ్చామే తప్ప, ఇప్పటికిప్పుడు ఎలాంటి నిర్ణయం వెలువరించడం కాదని పార్టీ అధినేత చంద్రబాబుకు అందరి అభిప్రాయాలను నివేదిస్తామని, తుది నిర్ణయం ఆయనదేనని పరిశీలకులుగా వచ్చిన మంత్రి గొట్టి రవికుమార్, ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీశ్‌లు స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి లాంటి కీలక పదవులు కేటాయిస్తారని ప్రకటించారు. ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఐదుగురు లోపు నేతలను అధ్యక్ష స్థానం నిమిత్తం నివేదిస్తామని ప్రకటిం చారు. ఏకాభిప్రాయం ఉంటే అత్యుత్తమంగా ఆ నేత పేరునే అధినేత చంద్రబాబు ప్రకటిస్తారన్నారు.



రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన నూజివీడు - తిరువూరు రహదారి

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌' చొరవతో

సమస్యలకు మోక్షం

- 'అక్షరం అండగా పరిష్కారమే అజెండా'కు స్పందన
- నూజివీడు సంగం కాంప్లెక్స్‌లో నేటి సాయంత్రం 4 గంటలకు సదస్సు
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న మునిసిపల్‌ చైర్‌పర్సన్‌ రామిశెట్టి త్రివేణిదుర్గ
- రూ.8 కోట్లతో రహదారులు, డ్రెయిన్లు, ప్రత్యేక పైప్‌లైన్ల ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి - నూజివీడు)

ప్రజా సమస్యలపై 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌' చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చింది. నూజివీడు సంగం కాంప్లెక్స్‌లోని పార్టీ హాల్లో ప్రజా సమస్యల పరిష్కారం దిశగా జనవరి 28వ తేదీన 'అక్షరం అండగా పరిష్కారమే అజెండా' నినాదంతో ప్రజల సమక్షంలో సభ నిర్వహించిన విషయం విదితమే. సమావేశానికి నూజివీడు మునిసిపల్‌ చైర్‌పర్సన్‌ రామిశెట్టి త్రివేణిదుర్గ, వైస్‌ ఛైర్మన్‌ పగడాల సత్యనారాయణ, మునిసిపల్‌ ఫ్లోర్‌లీడర్‌ చెరుకూరి దుర్గాప్రసాద్‌ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజా ప్రతినిధుల సాక్షిగా అధికారుల ముందు ఉంచారు.

ఈ సందర్భంగా క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, పార్కులలో వాకింగ్‌ ట్రాక్‌ల ఏర్పాటు, పెద్ద చెరువు గండి పూడ్చడం, రహదారుల అభివృద్ధి, డ్రెయిన్‌లలో సిల్ట్‌ తొలగింపు, నూతన డ్రెయిన్‌ల నిర్మాణం, ట్రిపుల్‌ ఐటీ మురుగునీటి సమస్య పరిష్కారం, స్థానిక ప్రజల సెంటిమెంట్‌ను దృష్టిలో పెట్టుకుని నూజివీడు నియోజకవర్గాన్ని విజయవాడ కేంద్రంగా ఏర్పాటైన జిల్లాలో విలీనం చేయడం, కుక్కలు, కోతుల బెడద తొలగించడం వంటి 22 సమస్యలను ప్రజలు ప్రజా ప్రతినిధులు, అధికారుల ముందు ఉంచారు.

ప్రజా సమస్యలను 'ఆంధ్రజ్యోతి' రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. దాదాపు రూ.2కోట్ల వ్యయంతో చెరువు గండ్లను పూడ్చడంతో పాటు రూ.80 లక్షల వ్యయంతో నూజివీడు - తిరువూరు ప్రధాన రహదారి అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశారు. నూజివీడు ట్రిపుల్‌ ఐటీ మురుగునీటి సమస్య పరిష్కారానికి రూ.3 కోట్ల75 లక్షలతో పైప్‌లైన్‌ నిర్మాణ పనులు చేపట్టగా 90 శాతం పూర్తికాగా సెప్టెంబరులో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇవేకాక ఇండోర్‌ స్టేడియం నిర్మాణం పనులకు సుమారు రూ.2కోట్ల నిధులను మంజూరు చేయించారు. నూజివీడు పట్టణంలో రహదారుల అభివృద్ధికి వివిధ పద్దుల కింద రూ.2 కోట్ల 86 లక్షలు మంజూరు చేయగా, కొన్ని టెండర్‌ దశలో ఉండగా, మరికొన్ని నిర్మాణాలు సాగుతున్నాయి. డ్రెయిన్‌ల నిర్మాణం రూ.68 లక్షలతో ఉండగా, పార్కుల అభివృద్ధి, వాకింగ్‌ ట్రాక్‌ల ఏర్పాటుకు రూ.48 లక్షలను మంజూరు చేశారు. రూ.38లక్షల వ్యయంతో శ్మశాన వాటికల ఆక్రమణల తొలగింపు, అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.15 లక్షలను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌' ఆధ్వర్యంలో నూజివీడు సంగం కాంప్లెక్స్‌లోని పార్టీ హాల్లో సోమవారం సాయంత్రం 4 గంటలకు సక్సెస్‌ మీట్‌ ఏర్పాటు చేసింది. దీనికి ముఖ్య అతిథులుగా నూజివీడు మునిసిపల్‌ ఛైర్‌పర్సన్‌ రామిశెట్టి త్రివేణిదుర్గ, వివిధ శాఖల మునిసిపల్‌ అధికారులు హాజరు కానున్నారు.

ఇదేంటి..సారూ?

స్త్రీ శక్తి పథకంతో.. సరిహద్దు వరకే ఆర్టీసీ ఉచిత సర్వీసులు పరిమితం

జీలుగుమిల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీశక్తి పథకంతో ఆంధ్రా ఉచిత బస్సు సర్వీసులు రాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యాయి. కొద్దిరోజులుగా ఆంధ్రా-తెలంగాణ సరిహద్దు జీలుగుమిల్లి వరకే ఆంధ్రాకు చెందిన పల్లె వెలుగు సర్వీసులు తిరుగుతున్నాయి. గతంలో ఈ సర్వీసులు తెలంగాణ- ఆంధ్రా మధ్య అంతరాష్ట్ర సర్వీసులుగా అశ్వారావుపేట వరకు రాకపోకలు సాగించేవి. ఇప్పుడు ఆంధ్రా సరిహద్దున నిలిపివేస్తున్నారు. ఆదివారం కూడా ఏలూరు- జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం-జీలుగుమిల్లి వరకే పల్లె వెలుగు బస్సులు నడిచాయి. జీలుగుమిల్లిలో కొంతసేపు ఆగి ప్రయాణికులను తరలిస్తున్నాయి. దీంతో విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారు మధ్యలో తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట దాటితేనే ఆయా మండలాలకు చేరుకోవాల్సి రావడంతో స్త్రీ శక్తి పథకం ఆయా మండలాల మహిళలకు అమలు కావడం లేదు. తమకు కూడా ఉచిత బస్సు పథకం అమలు చేయాలంటూ ఇటీవల ఆందోళనలకు సైతం దిగారు. ఈ క్రమంలోనే ఏలూరు, జంగారెడ్డిగూడెం డిపోల పల్లె వెలుగు బస్సులను సరిహద్దు వరకే నడపడంతో ఆ రెండు మండలాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో దారిలేక ఎక్స్‌ప్రెస్, ఆటోలకు ఎక్కువ చార్జీలు చెల్లించి ప్రయాణించాల్సి వస్తోంది. సరిహద్దున రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజరు గంగాధర్‌ను వివరణ కోరగా ప్రజా ప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి ముంపు మండలాల ప్రజల సమస్య వెళ్లిందని త్వరలో నిర్ణయం తీసుకుంటారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా సర్వీసులను ఆంధ్రాకు మాత్రమే పరిమితం చేశారన్నారు.



జీలుగుమిల్లి ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద నిలిపిన జంగారెడ్డిగూడెం డిపో ఆర్టీసీ బస్సు



జీలుగుమిల్లి శివారున ప్రయాణికుల కోసం నిలిపిన ఏలూరు డిపో బస్సు



ప్రమాణ స్వీకారం చేస్తున్న హెచ్‌ఎంల సంఘం జిల్లా నూతన కార్యవర్గ నాయకులు

నిరాధార ఆరోపణలపై హెచ్‌ఎంలకు నోటీసులిస్తే సహించం

- ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ

ఏలూరు అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులపై వచ్చే నిరాధార ఆరోపణలు, అభియోగాలపై న్యాయపరమైన నిర్ధారణ లేకుండా వారికి మెమోలు, షోకాజు నోటీసులు జారీ చేస్తే సహించేది లేదని ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడిగా ఆదివారం ఎన్నికైన వడ్లపట్ల మురళీకృష్ణ హెచ్చరించారు. హెచ్‌ఎంల సంఘం జిల్లా నూతన కార్యవర్గానికి స్థానిక జడ్పీ మినిస్టీరియల్‌ సంఘ కార్యాలయంలో ఆదివారం ఎన్నికలు జరిగాయి. కొత్త అధ్యక్షునిగా ఎన్నికైన మురళీకృష్ణ మాట్లాడుతూ బోధనేతర సిబ్బందితో చేయించుకోవాల్సిన పనులను డీఈవో కార్యాలయ అధికారులు హెచ్‌ఎంలతో చేయించుకుంటున్నారని, ఇకమీదట సంఘ జిల్లా యూనిట్‌ అనుమతి లేకుండా డీఈవో ఆఫీసుకు వెళ్లరాదని సమావేశంలో తీర్మానించినట్టు వివరించారు. గతేడాది పదో తరగతి పరీక్షల మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులకు పెండింగ్‌ బిల్లులు క్లియర్‌ అయ్యేలా, ప్రభుత్వ, పంచాయతీరాజ్‌ టీచర్లు, హెచ్‌ఎంల ఏకీకృత సర్వీసురూల్సును సాధించి పదోన్నతులకు ప్రయత్నిస్తామన్నారు.


నూతన కార్యవర్గమిదే..

ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జె.రవీంద్ర, కోశాధికారిగా బి.శ్రీధర్, గౌరవాధ్యక్షుడిగా జి.ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిలర్లుగా వి.శ్రీనివాసరావు, ఆర్‌.శైలజ, వి.హరిసీతా రామయ్య, ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా ఎ.సర్వేశ్వరరావు, హెడ్‌క్వార్టర్‌ సెక్రటరీగా పి.సురేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా సంఘ ఎన్టీఆర్‌ జిల్లా ప్రధానకార్యదర్శి కేశవరావు వ్యవహరించారు. కొత్తగా ఎన్నికైన జిల్లా కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం రెండేళ్లపాటు పదవిలో ఉంటుందన్నారు.

80,614 పట్టాదార్‌ పుస్తకాలు రెడీ

- రాజముద్రతో ముద్రణ పూర్తి
- గ్రామసభల్లో పంపిణీకి పాస్‌ పుస్తకాలు సిద్ధం
- తప్పులుంటే మార్పులు, చేర్పులకు అవకాశం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



నయాపైసా ఖర్చు లేకుండా, తప్పులు లేకుండా రైతులకు పారదర్శకంగా పట్టాదారు పుస్తకాలను జారీ చేయడానికి ప్రభుత్వం చేపట్టిన కసరత్తులు పూర్తయ్యాయి. రైతులకు ప్రభుత్వ రాజముద్రతో భూ యాజమాన్య హక్కు పత్రాలను (పట్టాదారు పాస్‌ పుస్తకాలు) ఆకర్షణీయంగా సిద్ధం చేశారు. జిల్లాలో మూడు విడత భూముల రీ సర్వేను ప్రభుత్వం చేపట్టింది. రెండు విడతల్లో చేపట్టిన రీసర్వే 64 గ్రామాల్లో రెవెన్యూ, ల్యాండ్‌ సర్వే అధికారులు ఆరునెలలు పాటు క్షేత్రస్థాయిలో పరిశీలనలు, రోవర్లతో తనిఖీలు చేపట్టి సమగ్రంగా పూర్తి చేశారు. మార్పులు, చేర్పులు, వెబ్‌ల్యాండ్‌ డేటా ఆధారంగా కొత్త పట్టాదారు పుస్తకాలను ప్రభుత్వం ముద్రింపచేసింది. గత వైసీపీ ప్రభుత్వం రైతుల పరంగా చేసిందేమీ లేకపోయినా..ప్రచార ఆర్భాటాలతో రైతులకిచ్చే పట్టాదారు పాస్‌పుస్తకాలపైన జగన్‌ బొమ్మ తో ముద్రించి పంపిణీ చేశారు. దీనికి కోట్లాది రూపాయలను వెచ్చించినా చివరకు రైతులకు ప్రయోజనం చేకూరలేదు. వీటిని సమూలంగా మార్చడంతో పాటు జిల్లాలో మ్యుటేషన్లు పూర్తయిన భూములకు సంబంధించి ప్రభుత్వ రాజముద్రతో ముద్రిం చిన 80,614 పట్టాదారు పుస్తకాలు దశలవారీగా జిల్లాకు వచ్చాయి. వాటిని పూర్తిస్థాయిలో డేటాతో సరిపోల్చుకుని పంపిణీకి సిద్ధం చేశారు.

రెవెన్యూ డివిజన్ల వారీగా పాస్‌ పుస్తకాలు

డివిజన్‌	గ్రామాలు	పాస్‌ పుస్తకాలు
ఏలూరు	71	36,267
జంగారెడ్డిగూడెం	92	42,874
నూజివీడు	7	1,473
మొత్తం	170	80.614

గ్రామసభల్లో పంపిణీకి సన్నాహాలు

గతంలో జాయింట్‌ ఎల్‌పీఎంల్లో తప్పులు దొర్లడంతో రైతులకు చాలాచోట్ల అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ కాలేదు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరించడంతో పట్టాదారు పుస్తకాలు సిద్ధం అయ్యాయి. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ అధికారులతో ఎప్పటికప్పుడు రివ్యూలను చేపట్టి, సీసీఎల్‌ఏ ద్వారా జిల్లాలకు అధికారులను పంపించి మరీ విచారణలు చేయించారు. ఈక్రమంలోనే సెప్టెంబరులో వారోత్సవాలు లేదా పక్షోత్సవాలను నిర్వహించి పంపిణీ చేసే అవకాశాలున్నట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

నేడు పీజీఆర్‌ఎస్‌లో వినతుల స్వీకరణ

ఏలూరు,ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్‌)లో సోమవారం ఏలూరు కలెక్టరేట్, మున్సిపల్, మండల, రెవెన్యూ డివిజన్ల కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్‌ వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఆర్‌ఎస్‌ను మండల, డివిజన్, మున్సిపల్‌ కార్యాలయాలకు వికేంద్రీకరణ చేశామని, ఆయా కార్యాలయాల్లో వినతులు స్వయంగా, ఆన్‌లైన్‌ ద్వారా అందించవచ్చన్నారు.

ముంపు గ్రామాలకు విద్యుత్‌ పునరుద్ధరణ

వేలేరుపాడు/ పోలవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ముంపు గ్రామాలకు ఆదివారం విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించారు. కొన్నిరోజులుగా గ్రామాలను వరద చుట్టుముట్టగా విద్యుత్‌ స్తంభాలు నీటమునిగిపోవడంతో వేలేరుపాడు మండలంలో 28 గ్రామాలకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేశారు. ఆదివారం నాటికి వరద తగ్గి విద్యుత్‌ స్తంభాలు బయటపడటంతో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సాల్మన్‌రాజు ప్రత్యేక పర్యవేక్షణలో సిబ్బంది మరమ్మతులు చేసి విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించారు. ఇంకా కొన్ని స్తంభాలు వరదనీటిలో ఉన్నప్పటికీ సమస్య తలెత్తినచోటకు విద్యుత్‌ సిబ్బంది పడవలపై వెళ్లి సమస్యను పరిష్కరి చారు. ఈ పునరుద్ధరణ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ జంగారెడ్డిగూడెం ఆపరేషన్‌ ఈఈ పీర్‌ అహ్మద్‌ఖాన్, జీలుగుమిల్లి ఏడీఈ కె.రమేశ్, వేలేరుపాడు విద్యుత్‌సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల పంపిణీ

వరదలో చిక్కుకున్న కటుకూరు, కోయిదా పంచాయతీ పరిధిలోని 15 గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచనల మేరకు ఆదివారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ ఆధ్వర్యంలో కూరగాయల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో పాటు వేలేరుపాడు జనసేన నాయకులు మోహన్‌ దొర, క్రాంతికుమార్, తమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఆర్డీవో రమణ

తగ్గుముఖం పట్టిన గోదావరి

పోలవరం వద్ద ఐదు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి ఆదివారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 32.60 అడుగులకు తగ్గింది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. కడెమ్మ స్లూయిజ్‌ వద్ద గోదావరి నీటిమట్టం తగ్గడంతో ఏటిగట్టుకి కుడివైపున ఉన్న కొండవాగుల జలాలు గోదావరిలోకి ప్రవహిస్తుండడంతో నీటమునిగిన పంటపొలాలు వరద నీటినుండి బయటపడుతున్నాయి.

అయ్యో.. మాస్టారూ..!

డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా

తొలుత నేడు పరిశీలనకు ఏర్పాట్లు

లోపలి పేజీలో..

సీఏ ఎవర్ గ్రీన్ కోర్సు



ఒకప్పుడు ఆర్ట్స్, కామర్స్ గ్రూపుల విద్యార్థులంటే చిన్న చూపు ఉండేది. చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ) లాంటి ప్రొఫెషన్స్ పాపులర్ అయ్యాక పరిస్థితి మారింది. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న సీఏల సంఖ్య కేవలం నాలుగు లక్షలు. 2050 నాటికి మన దేశానికి 50 లక్షల మంది సీఏలు అవసరం అని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' ప్రెసిడెంట్ చరణ్ జోత్ సింగ్ నంద ఇటీవలే ఒక మీడియా సమావేశంలో తెలిపారు. అంటే రాబోయే రోజుల్లో ఈ కోర్సుకు డిమాండ్ ఎలా ఉంటుందో అర్థం అవుతోంది. పాతికేళ్లుగా మన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు విదేశాల్లో ఎలా విజయం సాధిస్తున్నారో, అదేమాదిరిగా భవిష్యత్తులో చార్టర్డ్ అకౌంటెంట్లు కూడా మారే అవకాశం ఉంది. ఇంజనీరింగ్, మెడిసిన్‌తో పోలిస్తే ఈ కోర్సుకయ్యే ఖర్చు తక్కువ. ఉద్యోగం గ్యారంటీ. మారుతున్న అవసరాలు, మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా ఈ కోర్సులో మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి.

కమ్యూనికేషన్ స్కిల్స్‌కి పెద్దపీట

సీఏ కోర్సులోని మొదటి దశ సీఏ-సీపీటీ స్థానంలో ఇప్పుడు సీఏ ఫౌండేషన్ చేరింది. పాత సీపీటీలో పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో, నెగెటివ్ మార్కింగ్‌లతో ఉండేది. కొత్త విధానంలో 50 శాతం ప్రశ్నలు వ్యాసరూపంలో, 50 శాతం ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఇవ్వనున్నారు. అంటే మొత్తం 4 పేపర్లలో 2 పేపర్లు డిస్క్రిప్టివ్ పేపర్లు. దీంతో నెగెటివ్ మార్కులకు అవకాశం లేదు.

● అలాగే సీపీటీ విధానం ఉన్నప్పుడు అందులోని నాలుగు పేపర్లకు ఒకేరోజు పరీక్ష నిర్వహించేవారు. కానీ కొత్త విధానంలో ఫౌండేషన్‌లోని 4 పేపర్లను నాలుగు రోజులు(ఒక్కోరోజు ఒక్కో పేపర్) పరీక్ష నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్ష రాసే అవకాశం ఏర్పడింది. అలాగే 'ఆర్టికల్‌షిప్'(ప్రాక్టికల్ ట్రైనింగ్)లో కూడా కొన్ని మార్పులు చేశారు. ఒకప్పుడు ఐపీసీసీలో(ఇప్పటి సీఏ ఇంటర్మీడియట్) రెండు గ్రూపులు(లేదా) కనీసం మొదటి గ్రూపు పాస్ అయిన వారికే ఆర్టికల్‌షిప్‌కి అవకాశం ఉండేది. ఇప్పుడు సీఏ ఇంటర్‌లో రెండు గ్రూపులు పూర్తి చేసిన వారికి మాత్రమే ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో చేరే అవకాశం కల్పించారు.

రెండో దశ ఇంటర్

సీఏ ఫౌండేషన్ పూర్తి చేసినవారు ఇంటర్ చదవడానికి అర్హులు. గ్రాడ్యుయేట్లు/ సీఎంఏ ఇంటర్/ సీఎస్ ఇంటర్ పూర్తి చేసిన వారు ఫౌండేషన్‌తో సంబంధం లేకుండా నేరుగా సీఏ ఇంటర్ పరీక్ష రాయవచ్చు. సీఏ ఇంటర్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 18,000/-. ఈ పరీక్షని మే నెలలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం సెప్టెంబరు 1లోగా, సెప్టెంబరులో రాయాలనుకుంటే అదే సంవత్సరం జనవరి 1లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. జనవరిలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం మే 1లోగా నమోదు చేయించుకోవాలి.

డిగ్రీ అర్హతతో: డిగ్రీ అభ్యర్థులు ఫౌండేషన్‌తో సంబంధం లేకుండా నేరుగా సీఏ ఇంటర్‌కు నమోదు చేయించుకోవచ్చు. కామర్స్ యూజీ/పీజీ అయితే 55శాతం మార్కులు, ఇతర డిగ్రీ/ పీజీ అయితే 60శాతం మార్కులు ఉండాలి. అయితే వీరు సీఏ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే నాలుగు వారాల ఐసీఐటీఎస్ఎస్(ఇంటిగ్రేటెడ్ కోర్సు ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ స్కిల్స్) శిక్షణ తరగతులకు హాజరు కావాలి. దీని తరవాత ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రారంభించాలి. 8 నెలల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తిచేసిన వారే సీఏ ఇంటర్ పరీక్షకు అర్హులు.

● ఇంటర్‌లోని 6 పేపర్లను 2 గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో 3 పేపర్లు ఉంటాయి. ఒక్కోక్క పేపరు 100 మార్కులకు ఉంటుంది. ఇంటర్ పాస్ కావాలంటే ప్రతి పేపరులో 40 శాతం మార్కులు, గ్రూపు మొత్తం మీద 50 శాతం మార్కులు రావాలి. సీఏ ఇంటర్ రెండు గ్రూపులూ పూర్తి చేసిన వారు రెండు ఏళ్ల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తి చేయాలి.

ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఆర్టికల్‌షిప్): సీఏ ప్రాక్టికల్ ట్రైనింగ్‌ను గతంలో ఆర్టికల్‌షిప్ అని పిలిచేవారు. గతంలో ఈ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఆర్టికల్‌షిప్) మూడు సంవత్సరాలు ఉండేది. ఇప్పుడు దానిని రెండు సంవత్సరాలకు తగ్గించారు.

● సీఏ ఇంటర్ రెండు గ్రూపులూ పూర్తి చేసిన వారు ఇన్‌స్టిట్యూట్ వారి 4 వారాల ఏఐసీఐటీఎస్ఎస్(అడ్వాన్స్‌డ్ ఇంటిగ్రేటెడ్ కోర్సు ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ స్కిల్స్) శిక్షణ కూడా తీసుకోవాలి. వీరికి ఉపకారవేతనం లభించే అవకాశం ఉంది.

ఇటీవలి మార్పులు...

● గతంలో సీఏ ఇంటర్, ఫైనల్‌లో 8 పేపర్లు ఉంటే ఇప్పుడు అవి 6కి తగ్గాయి. విద్యార్థులు తరచూ ఫెయిల్ అయ్యే పేపర్లు తీసేశారు. ఒక ఎలక్టివ్ పేపర్‌ను జత చేశారు.

● ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ పరీక్షలు గతంలో సంవత్సరానికి రెండు సార్లు జరిపితే ఇప్పుడు ఏటా మూడు సార్లు నిర్వహిస్తున్నారు.

● అలాగే సీఏ ఫైనల్ చేస్తూ మూడు సంవత్సరాల పాటు ఆర్టికల్‌షిప్(ప్రాక్టికల్ ట్రైనింగ్) చేయాల్సి వచ్చేది. కొత్త విధానంలో ఇది రెండు సంవత్సరాలు మాత్రమే.

మొదటి దశ ఫౌండేషన్

సీఏ ఫౌండేషన్ పరీక్ష సంవత్సరానికి మూడుసార్లు (జనవరి, మే, సెప్టెంబర్) నిర్వహిస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 9,000/-. ఈ ఫౌండేషన్ పరీక్ష మే నెలలో రాయాలనుకుంటే అదే సంవత్సరం జనవరి 1లోగా, సెప్టెంబరులో రాయాలనుకుంటే అదే సంవత్సరం మే 1లోగా నమోదు చేయించుకోవాలి. ఇక జనవరిలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం సెప్టెంబరు 1లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇంటర్మీడియట్(లేదా), 10+2(లేదా) అందుకు సమానమైన పరీక్ష రాసిన వారు ఫౌండేషన్ కోర్సుకి నమోదు చేయించుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేసుకున్న నాలుగు నెలలకు ఫౌండేషన్ పరీక్ష రాయవచ్చు.

● ఇప్పటి సీఏ ఫౌండేషన్ స్థానంలో గతంలో నిర్వహించిన సీపీటీ పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల రూపంలోనే ఉండేది. కానీ, ప్రస్తుత ఫౌండేషన్ పరీక్షలో 50 శాతం మార్కులను డిస్క్రిప్టివ్ పరీక్షగా, మరో 50 శాతం మార్కులను మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుగా పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇక ఫౌండేషన్‌లో ఉత్తీర్ణత సాధించాలన్న విద్యార్థి ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం మార్కులు సాధించాలి అలాగే 4 పేపర్లు కలిపి 400 మార్కులకు గాను 50 శాతం మార్కులు అంటే 200 మార్కులు సాధించాలి.

మూడో దశ ఫైనల్

సీఏ ఇంటర్ తదుపరి రెండు సంవత్సరాల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తిచేసిన వారు సీఏ ఫైనల్‌కు నమోదు(రిజిస్ట్రేషన్) చేయించుకోవచ్చు. దీని రిజిస్ట్రేషన్ ఫీజు 22,000/-. ఫైనల్ నమోదుకి తుది గడువు అంటూ ఏమీలేదు. ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తి కాబోతున్న సమయంలో ఫైనల్‌కి నమోదు కావచ్చు. అంటే ఫైనల్ పరీక్షకు దరఖాస్తు చేసేలోగా రిజిస్ట్రేషన్ పూర్తి కావాలి. ఫైనల్ పరీక్షను కూడా సంవత్సరానికి మూడు సార్లు అంటే జనవరి, మే, సెప్టెంబరు నెలల్లో నిర్వహిస్తారు.

● ఈ పరీక్ష మొత్తం 6 పేపర్లు. 2 గ్రూపులుగా(గ్రూపుకి 3 పేపర్ల చొప్పున) ఒక్కోక్క పేపర్ 100 మార్కులకు మొత్తం 600 మార్కులకి ఉంటుంది. విద్యార్థి వీలును బట్టి 6 పేపర్లు ఒకేసారి లేదా ఒక్కో గ్రూపు విడివిడిగా రాసుకోవచ్చు.

● ఇందులో పాస్ కావాలంటే ప్రతి పేపరులో 40 శాతం మార్కులు, గ్రూపు మొత్తం మీద 50 శాతం మార్కులు రావాలి.

రిజిస్ట్రేషన్ కోసం:
www.icai.org/post/studentsservices లేదా 98851250001, 98851250003 హెల్ప్ లైన్ నెంబర్లని సంప్రదించవచ్చు.



ప్రకాశ్
డైరెక్టర్, మాస్టర్ మైండ్స్

దిక్సూచి

జామ్ 2026



'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్'(జామ్-2026) నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 22 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ(టెక్నాలజీ), ఎంఎస్ రిసెర్చ్, ఎంఎస్సీ ఎంటెక్, జాయింట్ పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ(డ్యూయల్ డిగ్రీ) కోర్సుల్లో అడ్మిషన్లు జరుపుతారు. ఈసారి ఎంట్రెన్స్‌ను ఐఐటీ బాంబే నిర్వహించనుంది. 2025 సెప్టెంబరు 5 నుంచి దరఖాస్తులు దాఖలు చేయవచ్చు. ఎంట్రెన్స్ 2026 ఫిబ్రవరి 15న జరుగుతుంది. ఫలితాలు మార్చి 18న వెలువడుతాయి.

అర్హత: నిర్దేశిత విభాగాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా అర్హులే.

సబ్జెక్టులు: బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మేథ్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ.

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి

దరఖాస్తులకు తుది గడువు: 2025 అక్టోబర్ 12

వెబ్‌సైట్: https://jam2026.iitb.ac.in

కేసీ మహీంద్రా స్కాలర్‌షిప్

'మహీంద్రా ఆల్ ఇండియా టాలెంట్ స్కాలర్‌షిప్-2025' కోసం కె.సి. మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో డిప్లొమా కోర్సులు అభ్యసించేందుకు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు సహాయం చేయడానికి స్కాలర్‌షిప్‌లను అందించనున్నారు.



● ఏటా రూ. 10,000 చొప్పున 550 మంది విద్యార్థులకు గరిష్టంగా 3 సంవత్సరాలపాటు ఈ స్కాలర్‌షిప్ అందజేస్తారు.

● 10/12వ తరగతి లేదా తత్సమాన పరీక్షలలో 60 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించి ఉండాలి. అలాగే డిప్లొమా కోర్సు కోసం ప్రభుత్వ/ గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశం పొంది ఉండాలి. కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హులు.

● **చివరి తేదీ:** 2025 ఆగస్టు 27.

● **వెబ్‌సైట్ :** www. kcmet.org

జాబ్ కార్నర్

హెడ్ కానిస్టేబుల్(రేడియో ఆపరేటర్), హెడ్ కానిస్టేబుల్(రేడియో మెకానిక్) గ్రూప్-సీ నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ నోటిఫికేషన్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతోంది.

బీఎస్ఎఫ్‌లో 1121 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

● హెడ్ కానిస్టేబుల్(రేడియో ఆపరేటర్) 910
● హెడ్ కానిస్టేబుల్(రేడియో మెకానిక్) 211

వయస్సు: 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.



చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 23

వెబ్‌సైట్: https//rectt.bsf.gov.in/

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులో లోకల్ ఆఫీసర్లు

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో తెలంగాణలో 50, ఆంధ్రప్రదేశ్‌లో 80 ఖాళీలు ఉన్నాయి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉండాలి. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. **చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 4

వెబ్‌సైట్: punjabandsindbank.co.in/

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

మదరాసి యాక్షన్



అమరన్ చిత్రం ఘన విజయం తర్వాత శివ కార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మదరాసి'. ఏ.ఆర్ మురగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. తాజాగా చిత్రబృందం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది. 'నీలాగే ఇతరులను ప్రేమించు... అందరినీ నీ కుటుంబమే అనుకో' అంటూ హీరోయిన్ రుక్మిణి వసంత్ పలికిన డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆకట్టుకునేలా ఉంది. డైలాగ్ పూర్తయిన వెంటనే పవర్‌ఫుల్ లుక్, పవర్‌ప్యాక్డ్ యాక్షన్‌తో కథానాయకుడిని పరిచయం చేశారు. ఆయుధ అక్రమ రవాణా నేపథ్యంలో మురగదాస్ కథను తీర్చిదిద్దారని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ చిత్రంలో విద్యుత్ జమ్వాల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. సెప్టెంబర్ 5న 'మదరాసి' ప్రేక్షకుల ముందుకు రానుంది.

రెండో పాటతో రెడీ



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. సెప్టెంబర్ 25న విడుదలవుతోంది. చిత్రబృందం ఆదివారం మరో అప్డేట్‌ను పంచుకుంది. వినాయక చవితి సందర్భంగా ఈ నెల 27న 'ఓజీ' నుంచి 'సువ్వీ సువ్వీ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేయనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రియాంక మోహన్‌తో కలసి పవన్ కల్యాణ్ కోనేటిలో దీపాలు వదులుతున్న లుక్‌ను పంచుకున్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బాలకృష్ణ



● భారతీయ సినీరంగంలో హీరోగా 50 సంవత్సరాల కెరీర్
● అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు, లోకేశ్

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే గోల్డ్ ఎడిషన్‌లో ప్రముఖ సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేరు నమోదైంది. భారతీయ సినిమాలో 50 సంవత్సరాల పాటు హీరోగా సుదీర్ఘ కెరీర్‌ను సాధించినందుకు ఆయన పేరును నమోదు చేశారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈవో సంతోష్ శుక్లా ఓ ప్రకటనలో.. బాలకృష్ణ ఐదు దశాబ్దాల సినిమా సేవలు లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని ప్రశంసించారు. ఈ నెల 30న వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు సంబంధించిన గుర్తింపు పత్రాన్ని హైదరాబాద్‌లో స్వయంగా బాలకృష్ణకు అందించనున్నట్లు శుక్లా తెలిపారు. లండన్ ప్రధాన కార్యాలయంగా ఉన్న వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంస్థ. బాలకృష్ణకు దక్కిన గుర్తింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. బాలకృష్ణ అసాధారణ సినీ ప్రస్థానానికి దక్కిన గుర్తింపుగా చంద్రబాబు కొనియాడారు. బాలయ్యకు అభినందనలు తెలిపారు. మంత్రి లోకేశ్ కూడా బాలకృష్ణకు అభినందనలు తెలిపారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

ఆ రోజే 'ఏం జరుగుతుందో..'

రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తోన్న సినిమా 'ది గర్ల్‌ఫ్రెండ్'. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్‌ని మేకర్స్ అనౌన్స్ చేశారు. 'ఏం జరుగుతోంది...' అంటూ సాగే గీతాన్ని ఈనెల 26న విడుదల చేయనున్నట్లు తెలిపారు. రాకేందు మౌళి సాహిత్యం అందించగా, చిన్మయి పాడారు. దీన్ని ఫీల్ గుడ్ లవ్ సాంగ్‌గా రూపొందించామని, సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.



రానా ఆవిష్కరించిన గీతం



అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి ముఖ్య తారాగణంగా మున్నా ధులిపూడి తెరకెక్కిస్తోన్న వినోదాత్మక చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్‌లైన్. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఇలా చూసుకుంటానే..' అంటూ సాగే గీతాన్ని హీరో రానా దగ్గుబాటి తన సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా ఆవిష్కరించారు. చంద్రబోస్ సాహిత్యానికి అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. 'ఈ పాటను జమ్మూ కశ్మీర్, మలేసియాలోని ప్రకృతి అందాలలో చిత్రీకరించామని, పూర్తిగా ఇది వినోద భరిత చిత్రం' అని యూనిట్ పేర్కొంది.

విశాల్ 'మకుటం'



హీరో విశాల్ 35వ ప్రాజెక్టుకు సంబంధించిన అప్డేట్ వచ్చింది. ఈ చిత్రానికి 'మకుటం' అనే పేరును మేకర్స్ ఖరారు చేసి టైటిల్ టీజర్‌ని రిలీజ్ చేశారు. రవి అరసు దర్శకత్వంలో సూపర్ గుడ్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆర్‌బీ చౌదరి నిర్మిస్తున్నారు. విశాల్ సరసన అంజలి కథానాయికగా నటిస్తున్నారు. టీజర్‌ను గమనిస్తే..ఇది సముద్రం నేపథ్యంలో నడిచే ఓ మాఫియా కథ అని అర్థమవుతోంది. జీవీ ప్రకాశ్ కుమార్ ఆర్ఆర్ అదిరిపోయింది. ఈ మూవీకి ఎన్.బి.శ్రీకాంత్ ఎడిటర్‌గా, దురైరాజ్ కళా దర్శకుడిగా, ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ రిచర్డ్ ఎం.నాథన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, ఇతర వివరాల్ని త్వరలో వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.

దుబాయ్‌లో 'గామా' వేడుక



'గామా'(గల్ఫ్ అకాడెమీ మూవీ అవార్డ్స్) అవార్డులకు టాలీవుడ్‌లో ఓ ప్రత్యేకత ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇప్పుడు ఐదో ఎడిషన్ వేడుకలను ఈనెల 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్, హీరోయిన్లు ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'గామా' సీఈవో సౌరభ్ కేసరి మాట్లాడుతూ 'ఇది కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న ఈవెంట్ కాదు. కళాకారులపై మా నాన్న త్రిమూర్తులుకు ఉన్న అభిమానంతో అవార్డులు ఇస్తున్నాం. వచ్చే ఏడాది మరింత ఘనంగా నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం. అలాగే ఇతర దేశాల్లోనూ గామా అవార్డులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రపంచంలోని తెలుగు వారందర్నీ అబ్బురపరిచేలా ఈవెంట్‌ను నిర్వహించబోతున్నాం' అని చెప్పారు.

సీనియర్ కార్టూనిస్టు దర్శకుడు శంకు కన్నుమూత



సీనియర్ వ్యంగ్య చిత్రకారుడు, రచయిత, దర్శక, నిర్మాత సంపర భీమ శంకర కుమార్ అలియాస్ శంకు(78) ఇకలేరు. ఆయన ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో గుండెపోటుతో బాగ్ అంబర్ పేటలోని స్వగృహంలో హఠాన్మరణం చెందారు. శంకు స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా తణుకు. బాపూ బొమ్మల స్ఫూర్తితో 1962లో తన 16వ ఏట కుంచె పట్టిన శంకు ఆంధ్ర పత్రికకు రెండు దశాబ్దాలు బొమ్మలు, కార్టూన్లు గీశారు. ఉన్నత విద్య అనంతరం ప్రఖ్యాత దర్శకుడు బాపు దగ్గర తొమ్మిది సినిమాలకు దర్శకత్వ శాఖలో పని చేశారు. ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో కొంతకాలం పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 'మిస్టర్ పెళ్లాం' సినిమాకు నిర్మాతగా వ్యవహరించినా, ఉద్యోగ నిబంధనల కారణంగా టైటిల్స్ లో మాత్రం సహ నిర్మాతగా వేయించినట్లు తానే ఓ సందర్భంలో చెప్పారు. మునిమాణిక్యం 'కాంతం కథలు', శంకరమంచి 'అమరావతి కథలు', వంశీ 'మా పసలపూడి కథలు', సయ్యద్ సలీం కథలను టెలివిజన్ ధారావాహికలుగా రూపొందించారు. అందుకుగాను నాలుగు నంది పురస్కారాలు అందుకున్నారు. తెలుగు కార్టూనిస్టులందరినీ ఒక వేదిక మీదకు తీసుకురావడంలో శంకు ప్రముఖ పాత్ర పోషించారు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన 13 మంది కార్టూనిస్టుల జీవితంపై 'ఎమినెంట్ కార్టూనిస్ట్స్ ఆఫ్ ఇండియా' పేరుతో దూరదర్శన్‌కు డాక్యుమెంటరీ చిత్రాలు తీశారు. క్రోక్విల్ హాస్య ప్రియ పేరుతో ఓ మాస పత్రికను కూడా నిర్వహించారు. క్రోక్విల్ అకాడమీ ద్వారా వ్యంగ్య చిత్రకారులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణం ఇతివృత్తంగా శంకు గీసిన కార్టూన్‌కు బెల్జియంలోని నాకీస్ట్ అంతర్జాతీయ పురస్కారం లభించింది. సాహిత్య, కళా రంగాలలో శంకు అందించిన సేవలకుగాను 2015లో తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారంతో సత్కరించింది. శంకు భార్య పేరు ఎల్లాప్రగడ శోభారాణి. ఆమె దూరదర్శన్ లో న్యూస్ రీడర్ గా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలందించారు. వీరికి ఇద్దరు పిల్లలు, కుమార్తె సత్య, కుమారుడు చైతన్య. శంకు భౌతికకాయానికి సినీ ప్రముఖులు వంశీ, బ్రహ్మానందం, రచయితలు బ్నిం, సుధామ, కార్టూనిస్టు సరసి తదితరులు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆదివారం సాయంత్రం అంబర్ పేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తయ్యాయి.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

కొలువుల రాణి

డీఎస్సీలో మూడు పోస్టులకు అర్హత


తల్లిదండ్రులతో సుధారాణి

ఉంగుటూరు ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆమెకు టీచర్ ఉద్యోగంపై మక్కువ. ఒక పక్క ఉద్యోగం చేస్తూనే డీఎస్సీకి సన్నద్ధమైంది. కష్టపడి చదివి ఒకేసారి మూడు ఉద్యోగాలకు అర్హత సాధించింది. ఇష్టపడి చదివితే ఎంతటి కష్టమైన లక్ష్యమైన సులువుగా సాధించవచ్చని నిరూపించింది కొలువుల రాణి సుధారాణి. మధ్య తరగతి జీవనంలో కష్టాలను ఎదుర్కొంటూ చదువు ద్వారానే కలలు నెరవేర్చుకోవాలని భావించింది. డీఎస్సీలో పట్టుదలతో, ప్రణాళికాబద్ధంగా చదివి మూడు పోస్టులకు అర్హత సాధించింది.

ఉంగుటూరు మండలం అప్పారావు పేట పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న అల్లు సుధారాణికి ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాలలో మూడు ఉద్యోగాలకు అర్హత సాధించారు. సుధారాణి తొలుత ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు పంచాయతీ కార్యదర్శిగా మూడు సంవత్సరాలు పనిచేసి ఇటీవల అప్పారావుపేట బదిలీ అయ్యారు. డీఎస్సీలో ఏలూరు జిల్లాలో స్కూల్ అసిస్టెంట్‌కు జిల్లా స్థాయిలో 4వ ర్యాంకు, పీజీటీలో 6వ ర్యాంకు, టీజీటీలో 17 వ ర్యాంకు సాధించారు. ఆమెను ఆంధ్రజ్యోతి పలకరించగా మూడు పోస్టులకు అర్హత సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కుటుంబ సభ్యులు ప్రోత్సాహంతోనే తానీ విజయాలు సాధించానని తెలిపారు. తమ మండలంలో పనిచేసే పంచాయితీ కార్యదర్శి సుధారాణి మూడు ఉద్యోగాలు సాధించడం పట్ల ఎంపీడీవో జీఆర్.మనోజ్ అభినందించారు. ఈవోపీఆర్‌డి, పంచాయితీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

జువ్వలపాలెం యువకుడికి 4 పోస్టులకు అర్హత



కాళ్ళ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జువ్వలపాలెంకు చెందిన నడిమింటి రాము డీఎస్సీలో ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించాడు. ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 3వ ర్యాంకు, పీఈటీ విభాగంలో జిల్లా 3వ ర్యాంక్, ఎస్‌జీటీ విభాగంలో జిల్లా 84వ ర్యాంక్, జోనల్ స్థాయిలో పీడీ విభాగంలో 9వ ర్యాంక్ సాధించాడు. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన రాము చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో తల్లి లక్ష్మి సంరక్షణలో చిన్ననాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం పూర్తి చేశాడు. ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తితో డిసెట్ రాసి రాష్ట్రస్థాయిలో 52వ ర్యాంక్ సాధించి అంగలూరు ప్రభుత్వ డైట్ కళాశాలలో రెండు సంవత్సరాల టీచర్ కోర్స్ పూర్తి చేశాడు. తర్వాత క్రీడలపై ఆసక్తితో భీమవరం డీఎన్నార్ కాలేజీలో రెండు సంవత్సరాలు బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. సుమారు ఏడాది పాటు పక్కా ప్రణాళికతో డీఎస్సీ కోసం సన్నద్ధమైన రాము నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించడంపై గ్రామస్తులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

కృషి, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

మనం ఏ స్థాయి నుంచి వచ్చినా కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ఎన్నో గొప్ప విజయాలు సాధించవచ్చు. తల్లిదండ్రుల కల సాకారం చేసినందుకు ఎంతో ఆనందంగా ఉంది. విద్యార్థులను విలువలు, మంచి క్రమశిక్షణతో చదువులో రాణించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. జిల్లాలో మూడో ర్యాంకర్‌గా నిలిచిన ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాము తెలిపారు.

స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపికైన స్నేహితులు


అంగాడి దుర్గారావు, పిల్లి బెనహం

ఆకివీడు రూరల్ ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇద్దరూ స్నేహితులు.. కలిసి చదువుకున్నారు.. ఒకటే కోర్సు ఎంపిక చేసుకున్నారు. ఒకేసారి డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించారు. ఆకివీడు మండలం గుమ్ములూరు గ్రామానికి చెందిన అంగాడి దుర్గారావు, చినకాపవరం గ్రామానికి చెందిన పిల్లి బెనహం ఇద్దరు చినకాపవరంలోని ప్రాథమిక, జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. ఇంటర్మీడియట్ ఆకివీడులోని ప్రైవేటు కాలేజీ, డిగ్రీ దుంపగడపలో వివిగిరి ప్రభుత్వ కళాశాలలో, బీపీఈడీ గోపన్నపాలెంలో అభ్యసించారు. డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో దుర్గారావు 89.5 మార్కులతో జిల్లా ఫస్ట్ సాధించగా, పిల్లి బెనహంకు 82.5మార్కులతో 13వర్యాంకు సాధించారు. ఇద్దరివి రెక్కాడితేగాని డొక్కాడని సాధారణ పేద కుటుంబాలు. కష్టపడుతూనే డిఎస్‌సిలో ర్యాంకుల సాధించారు. వారి కుటుంబాలలో ఆనందానికి అవధులు లేవు. ఆయా గ్రామాలలో వారికి అభినందనలు వెల్లువెత్తాయి.

ఉమ్మడి జిల్లాలో ఐదో ర్యాంక్


నాగిరెడ్డి వెంకట అఖిల్

పెరవలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పెరవలికి చెందిన నాగిరెడ్డి వెంకట అఖిల్ డీఎస్సీలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఐదో ర్యాంక్ సాధించాడు. కాకరపర్రు జడ్పీ హైస్కూల్‌లో 2013లో పదో తరగతి వరకు చదువుకున్నాడు. అనంతరం తణుకులోని ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలలో 2015లో ఇంటర్ పూర్తి చేశాడు. తర్వాత నాగార్జున యూనివర్సిటీలో కరస్పాండెన్స్ ద్వారా బీఎస్సీ డిగ్రీ చేశాడు. డీఎస్సీలో 91.84 స్కోర్ చేసి ఉత్తమ ఫలితం సాధించాడు. అతని తండ్రి ఎల్లయ్య రెండేళ్ల క్రితం మృతి చెందగా, తల్లి ఝాన్సీలక్ష్మి గృహిణి. సోదరుడు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగిగా స్థిరపడ్డాడు. సాధారణ కుటుంబంలో జన్మించి జిల్లా స్థాయిలో ర్యాంక్ సాధించడంపై పలువురు అభినందిస్తున్నారు.

రెండు ఉద్యోగాలకు అర్హత సాధించిన భవాని


గరగ ఎస్‌డీజీ భవాని

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన గరగ ఎస్‌డిజి భవాని డీఎస్సీలో రెండు ఉద్యోగాలకు అర్హత సాధించారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో 82.04 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ఏడో ర్యాంకు, టీజీటీ ఇంగ్లీష్‌లో 80.04 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 14 వ ర్యాంకు సాధించారు. భవాని మాట్లాడుతూ ఒకేసారి రెండు ఉద్యోగాలకు అర్హత సాధించడం సంతోషంగా ఉందన్నారు.

కానిస్టేబుళ్ల సర్టిఫికెట్ల పరిశీలన

● 311మంది హాజరు ● 25 నుంచి వైద్య పరీక్షలు

ఏలూరు క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కానిస్టేబుల్‌కు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. సివిల్ మహిళా కానిస్టేబుల్ పోస్టులు 56, పురుష కానిస్టేబుల్ పోస్టులకు 122, ఏపీఎస్పీ 139 పోస్టుల భర్తీకి ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈనెల 23, 24 తేదీల్లో ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, డీపీవో కార్యాలయ సిబ్బంది సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. మొత్తం 317 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 311 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఏపీఎస్‌పి పోస్టులకు 138 మంది, సివిల్ మహిళా పోస్టులకు 53 మంది, పురుషులు (సివిల్) 120 మంది హాజరయ్యారు. అభ్యర్థులకు ఈనెల 25, 26, 28, 29 తేదీలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వివిధ ట్రైనింగ్ సెంటర్లకు పంపిస్తారు.

ఎంఈవో పదోన్నతులపై

డీఈవో కార్యాలయ పెత్తనం తగదు

ఏలూరు అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పంచాయితీరాజ్ టీచర్లపై ప్రభుత్వ ఉపాధ్యాయులు, డీఈవో కార్యాలయ అధికారుల పెత్తనమేంటని ఎంఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీవీ.రామకృష్ణ ప్రశ్నించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఈవో, డీవైఈవో పదోన్నతుల్లో పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు/హెచ్ఎంలకు వాటిల్లుతోన్న నష్టాన్ని నివారించడానికి ఎంఈవో-1 పోస్టుల డిజిగ్నేషన్‌ను ఎంపీఈవో (మండల పరిషత్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్), జిల్లా పరిషత్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (జడ్పీ డీవైఈవో)లుగా మార్చాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ పర్యవేక్షణాధి కారులుగా పంచాయితీరాజ్ ఉపాధ్యాయులను మాత్రమే నియమించేలా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

గోవిందా.. గోవిందా..

ద్వారకాతిరుమల ఆలయంలో భక్తుల రద్దీ


చిన వెంకన్న ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చిన్న వెంకన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్య కావడంతో శనివారం భక్తుల రద్దీ బాగా తగ్గింది. ఆదివారం అందరికీ సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దేవస్థానంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్ర వాహనాలతో నిండింది. దాదాపు 15 వేల మంది ఆలయానికి వచ్చినట్లు అధికారుల అంచనా. శ్రీవారి ఉచిత దర్శనానికి 2గంటల పైబడి సమయం పట్టింది. సాయంత్రం రద్దీ కాస్త తగ్గుముఖం పట్టింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

బుట్టాయగూడెం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మన్యంలో అడవి బిడ్డల ఆరాధ్యదైవం గుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి వేలాదిగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా కమిటీ ఏర్పాట్లు చేసింది. మేఘాలు కమ్ముకోవడంతో భక్తులు త్వరితంగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

అయ్యో.. మాస్టారూ..!



- డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా
- తొలుత నేడు పరిశీలనకు ఏర్పాట్లు
- సాంకేతిక సమస్యతో తప్పని వాయిదా
- ఆదివారం రాత్రి హడావుడిగా ప్రకటించిన అధికారులు
- తర్వాతి తేదీపై స్పష్టత లేదు
- ఎంపిక జాబితాపై అభ్యర్థుల్లో ఉత్కంఠ

ఏలూరు అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సోమవారం నిర్వహించాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ వాయిదా పడింది. జిల్లాల వారీగా ఎంపిక జాబితాలు తయారైనప్పటికీ, వాటిని సాఫ్ట్‌వేర్‌లో మ్యాచ్‌చేసే ప్రక్రియ పూర్తికాకపోవడంతో జిల్లాల్లో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన వాయిదాకు కారణమని సమాచారం. ఉమ్మడి జిల్లా డీఎస్సీ సెలెక్టెడ్ అభ్య ర్థులకు సోమవారం ఏలూరులో జరగాల్సిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు వాయిదా వేశామని, తదుపరి తేదీని మళ్లీ అభ్యర్థులకు తెలియజేస్తామని ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకటలక్ష్మమ్మ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన మంగళ లేదా బుధవారం జరిగే అవకాశం ఉంది.

అభ్యర్థుల్లో హైటెన్షన్

తుది ఎంపిక జాబితాకోసం ఆదివారం రోజంతా అభ్యర్థుల్లో హైటెన్షన్ కొనసాగింది. ఆయా మేనేజ్‌మెంట్లలో వివిధ కేడర్లకు సబ్జెక్టుల్లో మెరిట్‌లో తొలివరుసలో ఉన్న అభ్యర్థులంతా ఎంపిక జాబితా కోసం ఎదురు చూశారు. ముఖ్యంగా తుది ఎంపికలకు కటాఫ్ మార్కులకు సమీపంలో వున్న అభ్యర్థుల టెన్షన్ తారస్థాయికి చేరుకుందనడంలో సందేహం లేదు. కటాఫ్ మార్కులు సబ్జెక్టుల వారీగా అంచనా వేస్తూ సోషల్‌మీడియా, వాట్సాప్‌లో ఊహాగానాలు హల్‌చల్ చేశాయి. తుది ఎంపికలపై జిల్లా, రాష్ట్రస్థాయిల్లో తమకు తెలిసిన లేదా పరిచయమున్న విద్యాశాఖ వర్గాలవద్ద వాకబుచేయగా, మరి కొందరైతే నేరుగా విద్యాధికారులకు, హెల్ప్‌లైన్ సెంటర్లు, హెల్ప్‌డెస్క్‌లకు ఫోన్లుచేసి ఆతృతను కనబరిచారు. కాగా ఆదివారం రాత్రి 9గంటలు దాటిన తర్వాత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వాయిదా పడిందని విద్యాశాఖ విడుదల చేసిన ప్రకటనతో ఉదయం నుంచి తుది జాబితా కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో టెన్షన్ పెరిగిపోయింది. సెలక్షన్ జాబితా విడుదలకాకపోవడం, ఎంపిక ఖరారైనట్టుగా అభ్యర్థుల లాగిన్‌లకు విద్యాశాఖ నుంచి ఆదివారం రాత్రివరకు ఇంటిమేషన్/కాల్ లెటర్ అందక పోవడంతో కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులతో పాటు, నిర్ణీత మార్కులకు కాస్తంత సమీపంలోవున్న ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది.

అంతర్ జిల్లా బదిలీల తర్వాతే..?

ఎంత ఆలస్యమైనా ఆదివారం రాత్రి సెలక్షన్ జాబితా విడుదలచేసి, సంబంధిత అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభిస్తారని ఒక దశలో ప్రచారం జరిగింది. డీఎస్సీ-2025 మెరిట్‌లిస్టుల ఆధారంగా నోటిఫై చేసిన పోస్టుల సంఖ్య, రిజర్వేషన్లకు అనుగుణంగా జీవో 90లో వివరించిన విధంగా జీవో 77లోని రోస్టర్ పాయింట్లప్రకారం మెరిట్ కం రోస్టర్‌తో సెలక్షన్ జాబితాలను తయారుచేసి పోస్టుల సంఖ్యతో సమానంగా 1:1 నిష్పత్తిన అభ్యర్థులను ఖరారుచేసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలవాలని నిర్ణయించారు. దీనికనుగుణంగానే వెరిఫికేషన్‌లో లోకల్, నాన్‌లోకల్ సర్టిఫికెట్, డీఎస్సీ దరఖాస్తుసమయంలో అప్‌లోడ్‌చేసిన సర్టిఫికెట్లు, టెట్ స్కోర్, పుట్టినతేదీ, కులధ్రువీకరణ, తదితర సర్టిఫికెట్ల జెన్యూనిటీ పరిలించడానికి ఏర్పాట్లు చేశారు. అందుతున్న సమాచారం ప్రకారం ముందుగా ఇన్‌సర్వీస్ టీచర్లకు అంతర్‌జిల్లా బదిలీలను పూర్తిచేసి, ఆ తర్వాత హైకోర్టు క్లియరెన్స్ ఇస్తే సెప్టెంబరు 5న మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌లో కొత్తగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందినవారికి వెబ్‌ఆప్షన్ల ద్వారా అందుబాటులో ఉన్న ఖాళీల్లో పోస్టింగ్‌లు ఇస్తారని ప్రచారం జరుగుతోంది.

సొసైటీల్లో గోల్డెన్ ఛాన్స్



సహకార రంగానికి పునరుజ్జీవం పోసేలా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. గత పాలకులు వైఫల్యాలు, అవినీతి కార్యక్రమాలకు వంతపాడడంతో డీసీసీబీ రూ.100 కోట్ల మేర నష్టాల్లో కూరుకుపోయింది. దాని నుంచి బయటపడటానికి వ్యాపార విస్తరణకు అడుగులు పడుతున్నాయి. బంగారంపై తక్కువ వడ్డీతో సహకార సంఘాల్లో సభ్యులకు రుణాలు అందించానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో కార్యరూపంలోకి తీసుకురానున్నారు

- బంగారంపై రుణాలకు వడ్డీ తగ్గింపు
- డీసీసీబీ ద్వారా 9 శాతం వడ్డీ
- ఉమ్మడి జిల్లాలో లక్ష మందికి ప్రయోజనం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సహకార సంఘాల ద్వారా రైతుల అవసరాలకు రుణాల మంజూరు, విత్తనాలు, పురుగుమందుల విక్రయాలతో సొసైటీలు వ్యాపారాలను చేస్తున్నాయి. తాజాగా వివిధ రూపాల్లో వ్యాపార విస్తరణకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. బంగారం ధరలు విపరీతంగా పెరుగడంతో బంగారంపై వడ్డీ తగ్గించి రుణాల మంజూరు ద్వారా రైతులకు చేరువకావడంతో పాటు వ్యాపారం పెరుగుతుందని అంచనా వేశారు. రైతులకు బంగారంపై రుణాలు ఇవ్వడానికి డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు కసరత్తు చేస్తున్నారు. తొలుత ప్రయోగాత్మకంగా ఉమ్మడి జిల్లాలో ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్నారు.

వాణిజ్య బ్యాంకులు, ప్రభుత్వ బ్యాంకులు బంగారంపై 10.5 శాతం వడ్డీ లెక్కన రుణాలు ఇస్తున్నాయి. డీసీసీబీ 33 శాఖల పరిధిలో బంగారంపై 9 శాతం వడ్డీకే రుణాలు జారీకి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. త్వరలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బోర్డు సమావేశంలో చర్చించి, దసరా నాటికి బంగారంపై రుణాలు అందజేతకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వాణిజ్యబ్యాంకులకు దీటుగా ఇప్పటికే గ్రాముకు రూ.5 వేలు రుణాలు ఇస్తున్నట్లు అధికారులు చెప్పారు.

లక్షమంది రైతులకు ప్రయోజనం

బంగారంపై తక్కువ వడ్డీతో రుణాల మంజూరుతో ఉమ్మడి జిల్లాలో లక్ష మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఏటా స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను 6 లక్షల మంది పైబడి తీసుకొంటున్నారు. దీనికి తోడు విద్యానిధి, వ్యక్తిగత రుణాలు, గృహ తనఖా రుణాలు కూడా తీసుకుంటున్నారు. మన జిల్లా- మన బ్యాంకు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు చేయండి - జిల్లా అభివృద్ధిలో మీరు కూడా భాగస్వాములు కండి అంటూ డీసీబీబీ రింగ్‌టోన్ ద్వారా ప్రచారం చేస్తోంది. బంగారంపై 9 శాతం వడ్డీకి రుణాలు ఇవ్వగలిగితే లక్ష మందికి ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది రూ.200 కోట్ల నుంచి 300 కోట్ల వరకు ఆప్కాబ్ నుంచి రుణం తీసుకుని బంగారంపై వ్యాపారం చేయడానికి డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, సీఈవో పి.సింహాచలం అడుగులు వేస్తున్నారు.


యోగా పోటీలలో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

యోగా తోనే ఆరోగ్యవంతమైన జీవనం

ముగిసిన రాష్ట్రస్థాయి యోగా పోటీలు

పెంటపాడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని డీఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్ అన్నారు. ప్రత్తిపాడు సరస్వతీ విద్యాలయ పాఠశాలలో నాలుగు రోజులు గా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో డీఎస్పీ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరూ కొంతసమయాన్ని యోగాకు కేటాయించాలన్నారు. యోగా నేషనల్ పరిశీలకులు యోగా చేయడం వల్ల అనేక రుగ్మతులను దూరం చేయవచ్చునన్నారు. హార్టీకల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బీ.శ్రీనివాసులు మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మనసు ప్రశాతంగా ఉంటుందన్నారు. పోటీలలో 87 మంది విద్యార్థులు బంగారు పతకాలను, 87 మంది వెండి పతకాలను, 86 మంది కాంస్య పతకాలను సాధించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏర్పాట్లను పాఠశాల చైర్మన్ కొలనువాడ వెంకటహనుమరాజు పర్యవేక్షించగా యోగా స్పోర్ట్ అథారిటీ సిబ్బంది అనంతనేని రాధిక, ప్రేమ్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి, దుర్గారావు, కరిబండి రామకృష్ణ పాల్గొన్నారు.

ఉప్పుటేరులో దూకి ఒకరి ఆత్మహత్య

ఆకివీడు ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల నేపథ్యంలో ఒక వ్యక్తి ఉప్పుటేరులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీరామపురానికి చెందిన మజ్జి గాంధీ (57) శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గాలింపు చర్యలు చేపట్టినా, బంధువులను ఆరా తీసినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం ఉప్పుటేరు వంతెన వద్ద గాంధీ సైకిల్ కనబడింది. మత్స్యకారులను ప్రశించగా ఎవరో ఉప్పుటేరులో దూకినట్లు శబ్దం వచ్చిందన్నారు. గాంధీకి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. మందపాడు రోడ్డులో ఉప్పుటేరు లాకుల దగ్గర సాయంత్రం మృతదేహం తేలింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ఉల్లి ధర తగ్గింది



- పెరిగిన కూరగాయల ధర
- నిలకడగా చికెన్

తాడేపల్లిగూడెం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో ఉల్లి ధర పడిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఉల్లి తడిసిపోవడంతో ధర పతనమైంది. క్వింటా ఉల్లి సైజును బట్టి రూ. 500 నుంచి 1000 ధరకు విక్రయించారు. కర్నూలు నుంచి 10 లారీల ఉల్లి తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వచ్చింది. నాణ్యత లోపించడంతో కొనుగోలు చేయడానికి చిరు వ్యాపారులు ముందుకు రాలేదని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిపోవడంతో బస్తాల్లో డ్యామేజ్‌లు వచ్చాయి. బస్తాల్లో ఉండగానే కొంత ఉల్లి కుళ్లిపోయింది. ఎన్నడూ లేనివిధంగా కర్నూల్‌లో ఈ సీజన్‌లో ఉల్లిని సాగు చేశారు. పెద్ద సైజుల్లో ఉల్లి వచ్చిందని రైతులు ఆనందపడ్డారు. మంచి ధర వస్తుందని ఆశగా ఎదరు చూశారు. తీరా వర్షాల ప్రభావంతో ఉల్లి తడిసింది. అయినకాడికి అమ్ముకోవాల్సి వచ్చింది.

డిమాండ్ తగ్గని మహారాష్ట్ర ఉల్లి

మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ తగ్గలేదు. క్వింటా హోల్ సేల్ రూ.1500 నుంచి 2100 మధ్య విక్రయిస్తున్నారు. రిటెయిలర్స్ రూ.100కు నాలుగు కేజీలు, నాసిరకం కలిపి రూ.100కు 5 కిలోల వంతున అమ్ముతున్నారు. గత వారంతో పోలిస్తే మహారాష్ట్ర ఉల్లి ధరలో పెద్దగా వ్యత్యాసం లేదు.

కూరగాయలు ప్రియం

మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరిగాయి. గత వారంతో పోల్చుకుంటే కిలోకు రూ.10పైగా పెరిగాయి. ఇటీవల భారీ వర్షాలకు కూరగాయల తోటలు దెబ్బ తినడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. వినాయక చవితి తరువాత నుంచి కూరగాయల ధరలు మరింత పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. వర్షాల ప్రభావంతో తోటలు దెబ్బతినడంతో తోటలు తేరుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని చెబుతున్నారు. వినాయకచవితి వెళ్లిన తరువాత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీనికితోడు దసరా ఉత్సవాలు తోడుకావడంతో మరింత పెరిగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంగ కిలో రూ. 50 నుంచి 60, బీర రూ.30 నుంచి 50 దొండ రూ.30 నుంచి 40, దోస రూ.30 నుంచి 40, బెండ రూ.30 నుంచి40, చిక్కుళ్లు రూ.110 నుంచి 120కు పెరిగింది. గత వారంతో పోలిస్తే కిలోకు రూ.10 పెరిగాయి. అగాకర మాత్ర దిగి వచ్చింది. కిలో రూ.200 ఉండే ఆగాకర కాయలు రూ.160కు విక్రయిస్తున్నారు.

చికెన్ ధర మారలేదు

మార్కెట్‌లో చికెన్ ధరలు ప్రస్తుతం నిలకడగా ఉన్నాయి. గతవారం బ్రాయిలర్ కిలో రూ. 220 ఉండగా ఈ వారం కూడా అదేస్థాయిలో ఉంది. లేయర్ కిలో రూ.200కు అమ్ముతున్నారు. వీటి ధరలు వినాయక చవితి తరువాత తగ్గవచ్చని వ్యాపారులు చెబుతున్నారు.


రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వంగవీటి రాధా, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

దోషులను శిక్షించాలి

వంగవీటి రాధా

కలిదిండి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అల్లర్లు సృష్టించడానికి రంగా విగ్రహాలపై దుశ్చర్యలకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలని రంగా తనయుడు వంగవీటి రాధా అన్నారు. కలిదిండి, సానారుద్రవరం గ్రామాల్లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలసి ఆదివారం రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేడ పూసిన రంగా విగ్రహాలకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాలాభిషేకం చేసి రంగా గౌరవం కాపాడినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ ఈ ఘటన సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లిందని దోషులను త్వరగా పట్టుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, జనసేన సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ నల్లగోపుల చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

అత్తిలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మంచిలి గ్రామానికి చెందిన ఉద్దరాజు ఫణి దుర్గా ప్రసాద్ గత నెల 30 నుంచి కనిపించడం లేదని ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి ప్రేమ్‌రాజు తెలిపారు. ఫణి దుర్గా ప్రసాద్ చేపల చెరువు వద్ద పనిచేసే వాడని గత నెల 30న పనికి వెళ్లి రాలేదంటూ దుర్గా ప్రసాద్ తల్లి రాధాకుమారి పిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అత్తిలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సైకిల్ మెకానిక్ నడపన శ్రీనివాసరావును మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయపడినట్లు ఎస్ఐ పి ప్రేమరాజు తెలిపారు. శ్రీనివాసరావు గత నెల 28న పని ముగించుకుని సైకిల్‌పై వెళుతుండగా వైష్ణవి టైల్స్ షాపు వద్ద గుర్తు తెలియని మోటారు సైకిల్ ఢీ కొనడంతో గాయపడ్డాడు. 30న ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడని తిరిగి ఆగస్టు 1న మళ్లీ ఆసుపత్రిలో చేరాడని తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

ఏలూరు క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం బీడీ కాలనీలో వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. గొల్లవెల్లి పద్మ (40) మహిళ ఒక ఇంటిని అద్దెకు తీసుకుంది. ఆమెతో పాటు కె.అశోక్‌కుమార్, పద్మ కుమారుడు గొల్లవెల్ల లోవరాజు కలిసి కొంత మంది యువతులను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. అశోక్‌కుమార్ పరారు కాగా గొల్లవెల్లి పద్మ, లోవరాజు, తంగెళ్ళమూడి తిలక్‌నగర్‌కు చెందిన ఆదిన ప్రసాద్‌ను అరెస్టు చేశారు. అక్కడ ఉన్న ముగ్గురు యువతులను సంరక్షణహోమ్‌కు తరలించారు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో దొంగనోట్ల జమకు యత్నం

ఏలూరు క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంక్ ఏటీఎంలో నకిలీ వంద రూపాయల నోట్లను జమ చేయడానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. చాటపర్రులో కెనరా బ్యాంక్ ఏటీఎంలో నకిలీ వంద రూపాయల నోట్లు 62 జమ చేయడానికి కొలుసు మేఘమాల, కొలుసు జయంత్, సైదు సతీష్ ప్రయత్నించారు. అవి ఏటీఎం మిషన్ లోపల పక్కన ఉన్నాయి. మిషన్ ఓపెన్ చేసినపుడు కెనరా బ్యాంక్ మేనేజర్ దిరిశాల రెడ్డి పరిశీలించారు. సీసీ పుటేజ్ పరిశీలించి కొలుసు మేఘమాలకు చెందిన కెనరా బ్యాంక్ ఖాతాలో ఈ సొమ్ము జమ చేయడానికి ఏటీఎం మిషన్‌లో వీరు పెట్టినట్లు గుర్తించారు. దీంతో ఆ ముగ్గురిపై మేనేజర్ ఫిర్యాదు చేయడంతో ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీచ్‌లో యువకుడి గల్లంతు

మొగల్తూరు, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఒక యువకుడు గల్లంతయ్యాడు. శేరేపాలెంకు చెందిన కొత్తపల్లి శ్రీహర్ష(19) స్నేహితులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు వెళ్లాడు. స్నానానికి దిగిన శ్రీహర్ష సముద్ర కెరటాల ఉధృతితో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న మొగల్తూరు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

ఘనంగా గంగానమ్మ జాతర

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):స్థానిక సుంకరవారితోటలోని గంగానమ్మ, పోతు రాజుబాబుల సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలో సంబరం సందడి నెలకొంది. గంగానమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు చిన్ని అర్జున్, కార్పొరేటర్ సుంకర చంద్రశేఖర్‌లు సారథ్యం వహించగా గ్రామ నాయకులు, పెద్దలు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అర్జున్ వెయ్యి మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వినాయక చవితి మండపం వద్ద ఘర్షణ

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బాట గంగానమ్మ లే అవుట్ కాలనీలో వినాయక చవితి పందిరి విషయమై ఇరువర్గాల మధ్య శనివారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈ తోపులాటలో ఒకరికి గాయాలవడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు సమాచారం. గత కొంత కాలంగా బాట గంగానమ్మ లే అవుట్ కాలనీ వద్ద ఆకతాయిలు మద్యం మత్తులో అల్లర్లు సృష్టిస్తున్నారని, పోలీసులు రాత్రిపూట గస్తీ నిర్వహించాలని మహిళలు కోరుతున్నారు. లేదంటే ఆకతాయిల అల్లర్లు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



జడ్పీ చైర్ పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సత్యసాయి కార్మికుల సమ్మె విరమణ

పోలవరం/ఏలూరు రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తమ జీతాల బకాయిల కోసం గత రెండ్రోజుల చేపట్టిన సమ్మెను కార్మికుల ఆదివారంతో ముగించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ జడ్పీ సీఈవో సత్యసాయి మంచినీటి సరఫరా కాంట్రాక్టరు జడ్పీ చైర్ పర్సన్ సమక్షంలో జరిపిన చర్చలు ఫలించాయి. ఏలూరులోని జడ్పీ క్యాంప్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌ని కలిసి ఆదివారం తమ సమస్యలను వివరించారు. మూడు వారాల్లోగా జీతాలు చెల్లించడానికి హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్టు కార్మికులు తెలిపారు.పే స్లిప్పులు, గుర్తింపు కార్డులు, కార్మికులకు అందాల్సిన ఏరియర్స్ మృతి చెందిన కార్మికుడు అంబటి వెంకన్నకు మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారని కార్మికులు తెలిపారు. సోమవారం నుంచి నీటి విడుదల ప్రారంభిస్తున్నట్టు సత్యసాయి కార్మికులు తెలిపారు. సత్యసాయి కార్మిక సంఘం మాజీ కార్యదర్శి సతీశ్, అధ్యక్షులు జి.శివసత్యనారాయణ, ఆచంట సత్యనారాయణ, పిల్లి వీరబాబు, బొంత ప్రసాద్, పోసిబాబు, ఎం.శ్రీనివాసరావు, బాబు, భాస్కర్ పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న కార్మికులు

ఆయిల్ పామ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చింతలపూడి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పి.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో జరిగిన సమావేశంలో సమస్యలపై మాట్లాడారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆయిల్ పామ్ గెలలు కోస్తూ విద్యుదాఘాతంతో మరణిస్తే అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. కార్మికుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యానవన, కార్మిక, విద్యుత్ శాఖల అధికారుల నిర్లక్ష్యానికి ఆయిల్ పామ్ కార్మికులు బలవుతున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే ఏలూరు జిల్లాలో సుమారు 15 వేల మంది ఆయిల్ పామ్ కార్మికులు మట్టలు, గెలలు కోయడం, లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసే కార్మికులు ఉన్నారని తెలిపారు. సెప్టెంబర్ 2న జిల్లాలో ఉన్న ఆయిల్ పామ్ కార్మికులు జంగారెడ్డిగూడెంలో జరిగే జిల్లా మహాసభ సదస్సుకు తరలిరావాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జీవరత్నం, ఎం.సత్యనారాయణ, మాదాసు నరసింహరావు, వర్మ మాట్లాడారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం చూపండి మహాప్రభో

టి.నర్సాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఏపిగుంట పంచాయతీలోని రామన్నగూడెం గ్రామంలో మంచి నీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు వెంకట్రావు మాట్లాడుతూ పది రోజులుగా తాగునీరు రాకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడం, విడ్డూరంగా ఉందన్నారు. రామన్నగూడెం గ్రామం పక్కనే ఉన్న పొలాల నుంచి తాగునీరు తెచ్చుకుని గడుపుతున్నారని ఇప్పటికైన అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అక్రమ టోల్ వసూళ్లపై చర్యలేవి : సీపీఎం

కుక్కునూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెదరావిగూడెం, వెంకటాపురం, వేలేరు, అల్లిగూడెం, తదితర పంచాయతీల్లో వందలాది జామాయిల్ నర్సరీలకు సంబంధించి అక్రమ టోల్ వసూళ్లపై చర్యలేవని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్రరావు ప్రశ్నించారు. ఇక్కడ నర్సరీలు గిరిజనులు కాకుండా గిరిజనేతరులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారన్నారు. వేలంపాట పేరుతో అక్రమంగా టోల్‌వసూలు చేసుకుంటున్నారని ఆరోపించారు. వై.సాయికిరణ్, వలీ బాషా, లక్ష్మణరావు ఉన్నారు.

రాట్నాలమ్మకు విశేష పూజలు



పెదవేగి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మ వారికి ఆది వారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలిని నైవే ద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయార్చకులు పావులూరి వీర వెంకట రామసత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలా ర్చన పూజలు నిర్వహించారు. పూజా రుసుం ద్వారా రూ.47,860లు, లడ్డూ ప్రసా దాల విక్రయాల ద్వారా రూ.18,885లు, ఫొటో విక్రయాల ద్వారా రూ.2,315వేలు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ తెలిపారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

ఏలూరు రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎరువుల షాపులను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాషా తన సిబ్బందితో కలిసి ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల డీలర్లను పలు సూచనలు జారీ చేశారు. లైసెన్సులు తప్పకుండా షాపుల్లో ప్రదర్శించాలని, బిల్లు బుక్కులు, ఇన్‌వాయిస్‌లు, రిజిస్టర్‌లు పక్కాగా నిర్వహించాలని సూచించారు. అధిక యూరియా వల్ల కలిగే నష్టాలను నానో యూరియా ఉపయోగాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. యూరియాను పంట పొలాలకు మాత్రమే అమ్మాలని, ఇతర అవసరాలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు పర్యావరణ పరిరక్షణ కోసం నానో ఎరువులు ఉపయోగించాలన్నారు. జేడీఏ అనీలకుమారి, ఎంఏవోడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాకో.. ఛాన్స్ ప్లీజ్!

(5వ పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు నాయుడు ఇష్టమది. కొందర్ని వలస పక్షులుగా పేర్కొన్నా ముందు వెనుకా ఆలోచించే సీఎం నిర్ణయం తీసుకున్నారని, ఈ నిర్ణయాన్ని ఎవరు కాదనలేం ఖచ్చితంగా గౌరవించి తీరాల్సిందే.' మంత్రి పార్థసారథి అన్నారు. పార్టీ అధ్యక్ష ఎంపికలో ఏకాభిప్రాయం అవసర మని అందుకోసం ఈ తరహా సమావేశం ఏర్పాటు చేసిందని, వచ్చేసారి కూడా సీఎం చంద్రబాబు కొనసాగాలని ఆ మేరకు ఇప్పటి నుంచే కేడర్ యావత్తు పట్టుదలతో పనిచేయాలని మంత్రి సూచించారు. పార్టీ ఆదేశం మేరకు ఎవరైతే అధ్యక్ష స్థానాన్ని ఆశిస్తున్నారో అటువంటి వారి వివరాలన్నింటిని అధిష్ఠానంకు నివేదించేందుకే ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించారని, పార్టీ తీసుకునే నిర్ణయాన్ని అందరూ గౌరవించాల్సిందేనని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ అన్నారు. అందరూ కలిసి కట్టుగా ఉన్నాం. నిర్ణయాల్లోనూ ఇదే రకంగా ఉండాలి. పార్టీ క్రమశిక్షణకు ఇదెంతో ముఖ్యమని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. అందరం కలిసికట్టుగా వెళితేనే తెలుగుదేశం కుటుంబానికి కీర్తి, ప్రతిష్ట అని కైకలూరు నేత నర్సింహమూర్తి అన్నారు.

మాకు కావాలి.. మాకు కావాలి : తెలుగుదేశంలో పదవుల కోసం ఎవరంతటి వారుగా ఆదివారం జరిగిన సమావేశంలో పోటీలు పడ్డారు. పరిశీల కుల ఎదుట తమ బయోడేటాను సమర్పించడమే కాకుండా తమకున్న అర్హతలను ఏకరవు పెట్టారు. అధ్యక్ష స్థానానికి సుమారు 10 మందికి పైగా పోటీపడగా, అనుబంధ సంఘాలు, జిల్లా పార్టీలోను మిగతా పదవులకు తాము అర్హులేమేనంటూ దరఖాస్తులు డజన్ల సంఖ్యలో అందజేశారు. ప్రస్తుతానికి అధ్యక్ష స్థానానికి మాత్రమే అభిప్రాయ సేకరణ జరుగుతుందని పదేపదే చెప్పినప్పటికి వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన వారంతా వివిధ పదవుల కోసం దరఖాస్తు అందించేందుకు వెనకడుగు వేయలేదు. పెద్ద సంఖ్యలో కేడర్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, జెడ్పీ మాజీ చైర్మన్ కొక్కిరగడ్డ జయరాజు, అక్కిన నాగమణి, చింతల వెంకట రమణ,ఉండమట్ల సునీత, జగ్గవరపు ముత్తారెడ్డి, జయ వరపు శ్రీరామమూర్తి, రాష్ట్ర నాయకులు దాసరి ఆంజ నేయులు, షేక్ ముస్తఫా, రావేరి కృష్ణ, ఏలూరి హరిబాబు, కె.వెంకట సత్యనారాయణ, ఉప్పాల జగదీశ్ బాబు,ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి పాత బిల్లులు విడుదల

ఏలూరు మండలానికి రూ.కోటి మంజూరు

ఏలూరు రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పనులు చేసి బిల్లులు కోసం ఎదరు చూస్తున్న కాంట్రాక్టర్లుకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గతంలో 2014 నుంచి 2018 వరకు టీడీపీ ప్రభుత్వ హాయంలో చేసిన పనుల బిల్లులను వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలిపివేసింది. కొందరు కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించగా, మరికొందరు అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయారు. తాజాగా కూటమి ప్రభుత్వం వీరి బకాయిలు చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత టీడీపీ ప్రభుత్వ హాయంలో ఏలూరు రూరల్ మండలంలో మూడు కోట్లు విలువైన రహదారుల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు చేశారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఈ పనులకు వైసీపీ అధికారంలోకి వచ్చాక బిల్లులు చెల్లింపులు సక్రమంగా జరపలేదు. దీంతో కాంట్రాక్టర్లు బిల్లులు అందక, చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంత మంది హైకోర్టును ఆశ్రయించడంతో 20 శాతం మినహాయించుకుని అరకొరగా చెల్లింపులు జరిపారు. కోర్టును ఆశ్రయించని అనేక మంది కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లింపులకు నోచుకోకుండా ఉండిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఉపాధి పనుల పెండింగ్ బిల్లుల విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన కేంద్రం జిల్లాలో 2014-18 మధ్య కాలంలో చెల్లింపులకు నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులకు ఏలూరు రోడ్లు మండలానికి సంబంధించి రూ.కోటి మంజూరు చేసింది. వాస్తవానికి ఈ పనుల వివరాలను గత వైసీపీ ప్రభుత్వం ఉపాధి హామీ ఆన్‌లైన్ పోర్టల్ నుంచి తొలగించింది. దీంతో అన్ని మండలాల్లో పెండింగ్ బకాయిలు వివరాలు, కాంట్రాక్టర్లు ఆన్‌లైన్ బ్యాంక్ ఖాతాల వివరాలను అధికారులు సేకరించారు. పెండింగ్ బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు డ్వామా, ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పనుల బిల్లులు చెల్లింపునకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని ఏలూరు రూరల్ మండలం ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో బాషా తెలిపారు. బకాయిలు సంబంధిత కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయన్నారు.



ఉపాధి పనిలో భాగంగా నిర్మించిన రోడ్డు

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి : రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం వెన్నవల్లివారిపేటలో ఆదివారం బాల్యవివాహాలు- గర్భధారణ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ మహిళలకు 18 ఏళ్లు, పురుషులకు 21 ఏళ్లు నిండిన తరువాత మాత్రమే వివాహాలు జరిపించాలన్నారు. బాల్యదశలో వివాహాలు జరిపించడం వల్ల బాలికలకు ఆరోగ్య సమస్యలు సంభవించడమే కాకుండా కొన్ని పరిస్థితుల్లో తల్లి, బిడ్డ మరణాల సంభవిస్తున్నాయన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాత మాత్రమే మహిళలు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని, పుట్టిన బిడ్డ కూడా ఆరోగ్యకరంగా ఉంటుంది. ఎటువంటి న్యాయ సహాయం కావలసి ఉన్నను జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను కాని 15100కాని సంప్రదించవచ్చన్నారు. ఐటీడీఏ పీవో కె రాములు నాయక్ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించిన వారికి మంచి చెడులపైన అవగాహన ఉంటుందని ప్రతిపౌరుడు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. పిల్లలకు ఉన్నత చదువులు నేర్పించాలని తద్వారా బాల్య వివాహాలను అరికట్టవచ్చని సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డెమో డాక్టరు దీపిక, సీడబ్ల్యూసీ ఇన్‌ఛార్జి చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, మాస్టరు గ్రైనీ పి.రత్నరాజు, ఏలూరు గిరిజనుల సంఘ ప్రెసిడెంటు కృష్ణనాయక్, సోషల్ వర్కరు ఎం అజయ్ బాబు, 59వ సచివాలయ అడ్మిన్ మనోజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

గణేశ్ ఉత్సవాలను ఆనందంగా జరుపుకోండి



కమిటీలకు సూచనలు చేస్తున్న ఎస్.ఐ జయబాబు

ఏలూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు శాంతియుతంగా జరుపుకోవాలని లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని వినాయక విగ్రహాల మండపాల కమిటీలకు సూచనలు చేశారు.

● టి.నర్సాపురం: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నిర్వహించే గణేశ్ ఉత్సవాల నిర్వాహకులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు. పోలీస్ స్టేషన్ గణేశ్ ఉత్సవాల నిర్వాహకులకు ఆదివారం అవగాహన కల్పించారు. విగ్రహాల నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు పొందాలని కమిటీ వారు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

● దెందులూరు: వినాయక చవితిని ఆనందోత్సాహాల మధ్య భక్తి శ్రద్ధలతో ఎదుటివారికి ఇబ్బందులు కలిగించకుండా పోలీసుల అనుమతి మేరకు నిర్వహించుకోవాలని దెందులూరు ఎస్.ఐ. శివాజీ అన్నారు. ఆదివారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ పండుగ సందర్భంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఉల్లంఘించిన వారిపై 32 పోలీస్ యాక్ట్, 223 బి ఎన్.ఎస్ సెక్షన్‌ల ప్రకారం ఆరు నెలల శిక్ష, రూ.వేయి జరిమానా విధించడం జరుగుతుందన్నారు.ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించకుండా మండపాల వద్ద లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదని కమిటీ వారు భక్తులకు గ్రామస్థులకు ఇబ్బందులు కలగకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ఎస్.ఐ. శివాజీ తెలిపారు.

అమ్మవార్ల జాతరకు ప్రచార పత్రాల విడుదల

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తూర్పు వీధిలో 150 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు బాబుల ఆలయంలో అమ్మవార్ల జాతర మహోత్సవాన్ని నిర్వహించేందుకు నిర్ణయించినట్టు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రకటించారు. ఆదివారం ఆలయం వద్ద ఇందుకు సంబంధించిన అంకురార్పణ జరిపారు. జాతర వివరాలను తెలియజేసే పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 31న ఉదయం పందిరి రాట వేయడం, ముడుపు కట్టడం జరుగుతుందన్నారు. నవంబరు 23న ఉదయం అమ్మవార్లను భూమి మీద పాదం మోపే కార్యక్రమం జరుగుతుందన్నారు. 26న అమ్మవార్లను మేడల్లో ప్రవేశపెట్టే కార్యక్రమం జరుపుతామన్నారు. 2026 జనవరి 25న అమ్మవారి జాతర చేసేందుకు కుంభం పోయడం ప్రారంభమవుతుందన్నారు. 26న ఉదయం అమ్మవార్లను మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, చిత్రవిచిత్ర వేషధారణలతో, బాణాసంచా వెలుగులతో వైభవంగా సంప్రదాయబద్ధంగా సాగనంపుతూ జాతర కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట దేవాలయ చైర్మన్ వంకినేని భాను ప్రకాష్, వంకినేని కిరణ్‌కుమార్, వంకినేని మహేంద్రకుమార్, వంకినేని రఘు కుమార్, మునునూరు బాలాజీ, కొట్లూరి సత్యకుమార్, వంకినేని ఆహ్లాద, వంకినేని పృధ్వీకృష్ణ, కలగర శివరామకృష్ణ ప్రసాద్, ఎడ్లపాటి రాము, గోవాడ శివరామకృష్ణలు ఉన్నారు.



ప్రచార పత్రాన్ని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చంటి

5 నుంచి ముత్యాలమ్మ జాతర

చింతలపూడి: నగర పంచాయతీలోని వెలమపేటలో ఉన్న ముత్యాలమ్మ ఆలయ 74వ వార్షికోత్సవాన్ని సెప్టెంబరు 5 నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో శాంతి కోసం, పంటలు పండాలని ఈ ఉత్సవాలను చేస్తుంటామని, జాతరకు తరలివచ్చి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

2 నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్: రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సెప్టెంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు శ్రీవారి 24వ వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్ కుమార్, ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజా చార్యులు తెలిపారు. పవిత్రోత్సవాల్లో ఉదయం,సాయంత్రం వేళల్లో విశేష పూజలు, అర్చనలు, హోమాలు ఉంటాయన్నారు. 3న చతుష్టానార్చన, కలశ స్నపనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చంటి దంపతులు నిర్వహిస్తారన్నారు. 4న సుదర్శన నరసింహ హవనం, 5న శ్రీవారి మూలవరులకు అష్టోత్తర శతకలశాభిషేకం, మహాపూర్ణాహుతి జరుగుతాయని వారు తెలియజేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

పెదవేగి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకున్న బాధితులకు మంజూరైన చెక్కులను అందించారు. ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ ఎంతోమంది పేదలు సరైన వైద్యం అందక అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. అలాంటివారికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా వైద్యానికి అవసరమైన సొమ్మును అందిస్తోందన్నారు.

● ద్వారకాతిరుమల: నిరుపేద కుటుంబాలకు కష్టకాలంలో సీఎం సహాయ నిధి భరోసా కల్పిస్తోందని జి.కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రేగంటి రాంబాబు అన్నారు. మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో ఇటీవల అనారోగ్యంతో చికిత్స తీసుకుని కోలుకున్న నారా శ్రీనివాసరావుకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారుడి ఇంటికివెళ్లి రాంబాబు అందజేశారు. బాధిత కుటుంబం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ పోతన ధర్మరాజు, ముత్తింటి సత్యనారాయణ పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న రాంబాబు

గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మించాలి : రైతు సంఘం

టి.నర్సాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ఇరువైపులా సర్వీసు రోడ్డు వేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.శ్రీనివాస్, నిర్వాసిత రైతులతో కలిసి డిమాండ్ చేశారు. స్థానిక శివాలయ కల్యాణ మండపంలో నిర్వాసిత పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు దేవరపల్లి సత్యనారాయణ, వామిశెట్టి హరిబాబు, పర్వతనేని మురళీ, మాలేంపాటి హరిబాబు, చీకటి శ్రీనివాసరావులు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల రైతులు చాలా నష్టపోయారన్నారు. అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేస్తున్న సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు. ఉపయోగంలేని గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎందుకని ప్రశ్నించారు. సర్వీసు రోడ్డులపై ప్రొవిజన్ కల్పించాలని చట్టప్రకారం న్యాయం, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి 8 గంటల వరకు విస్తృతంగా పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు మరణించిన వారిలో తలకు దెబ్బతగలడం వల్ల మరణిస్తున్నారని ఈ నేపథ్యంలో హెల్మెట్ ధరించి ఉంటే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వాహనానికి ఇన్సూరెన్స్, వాహనం నడిపేవారికి డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సరైన రికార్డులు లేనివారికి ఇ-చలానా విధించారు.



డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్.ఐ రాజారెడ్డి

రహదారి భద్రతపై అవగాహన

కుక్కునూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కుక్కునూరులో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై కుక్కునూరు ఎస్.ఐ. రాజారెడ్డి ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలు సూచనలు చేశారు. ఆటో డ్రైవర్లు రహదారి నియమాలు కచ్చితంగా పాటించాలన్నారు అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌ను నివారించాలన్నారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనాలను సరైన కండిషన్‌లో ఉంచాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర ధృవీకరణ పత్రాలను ఎల్లప్పుడు తమ వద్ద ఉంచుకోవాలన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

దెందులూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలని దెందులూరు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్యకృష్ణ అన్నారు. ఆదివారం దెందులూరులోని వీర మాచినేని పుష్ప కల్యాణ మండపంలో పార్టీ మండల సమావేశం మండలాధ్యక్షురాలు చీకటి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా పార్టీ పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణ ప్రసాద్, ఉండవల్లి వెంకట్రావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కన్వీనర్ చైతన్య కృష్ణ మాట్లాడుతూ వచ్చే నెల 3న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఏలూరు పర్యటన నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు మండూరి బుజ్జి గోపాల్, పి.నాగ రామ్మోహన్‌రావు, తోట ఆంజనేయులు, ఏసోబు, నళిని, ప్రభు చౌదరి ఉన్నారు.

మొదలైన గణపతి ఉత్సవాల సందడి



ఉంగుటూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో వి నాయక చవితి ఉత్సవాల హడావుడి మొదలైంది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం కైకరం ఒకటవ వార్డు లోని వినాయక ప్రతిమను ట్రాక్టర్‌పై ఊరేగించారు. స్థానిక వర్తకుడు నక్కిరి దుర్గాప్రసాద్ సహకారంతో ఒకటవ వార్డు సభ్యుడు శానం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఊరేగించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఉంగుటూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):నిడమర్రు ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు బాదంపూడి రూరల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈ.ఈ. కే.ఎం. అంబేద్కర్ తెలిపారు. దీంతో రాచూరు, రావులపర్రు, సీతారాంపురం గ్రామాల చేపల చెర్వులకు విద్యుత్ ఉండదన్నారు.

జంగారెడ్డిగూడెం మండలంలో..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం, జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి, పి.నారాయణపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ ఆదివారం తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం, జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి, పి.నారాయణపురం సబ్ స్టేషన్ల పరిధిలో రైతులు సహకరించాలన్నారు.

గుండె పోటుతో రజక నాయకుడు చంటి మృతి



దెందులూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రజక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కొవ్వలి రజక సంఘ మాజీ అధ్యక్షుడు గోవాడ సత్యనారాయణ(చంటి) గుండె పోటుతో మృతి చెందారు. కొవ్వలిలోని స్వగృహంలో ఉన్న ఆయన భౌతికకాయానికి సంఘ అధ్యక్షులు గోవాడ నాగరాజు, గుళ్లపూడి వెంకటేశ్వరావులు నివాళులర్పించారు.

సురవరం మృతి తీరనిలోటు

కుక్కునూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు యోధుడు, సీపీఐ అగ్రనేతమాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మృతి తీరనిలోటని సీపీఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య సంతాపం వెలిబుచ్చారు. వామపక్ష భావజాలంతో ప్రజాపోరాటాల్లో ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కాగా ప్రకటన జారీ చేసినవారిలో శ్యామలా, ఐతా సురేశ్, బాబూరావు, ఎం.వెంకటాచారి ఉన్నారు.

ఒంగోలు తరలిన సీపీఐ శ్రేణులు

కామవరపుకోట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు గాను కామవరపుకోట మండలం నుంచి పలువురు సీపీఐ నాయకులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు సభలకు తరలివెళ్లారు. సీపీఐ నాయకులు టి.వి.ఎస్.రాజు, ఏఐటీయూసీ నాయకులు కంకిపాటి బుచ్చిబాబు, అనుబంధ సంఘాల ప్రతినిధులు దుర్గారావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు బృందం ఎర్ర చొక్కాలు వేసుకుని ఉత్సాహంగా తరలివెళ్లారు.

నేడు సీపీఎం ధర్నా

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ భూముల సమస్యలు పరిష్కరించాలని, గిరిజనులు, దళితులు, పేదలకు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. భూమిలేని పేదలకు కనీసం ఎకరం నుంచి రెండు ఎకరాలు పంచాలని డిమాండ్ చేశారు.

నీలంశెట్టి లక్ష్మి ఎంపిక పట్ల హర్షం

ఏలూరు రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి ఎంపికయ్యారు.ఆదివారం అహ్మదాబాద్‌లో ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా నీలంశెట్టి లక్ష్మిని ఎంపిక చేశారు. ఆమె ఎంపిక పట్ల రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బడేటి వెంకటరామయ్య, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి టి.దిన్నాబాబు, జిల్లా కార్యదర్శి సర్వేశ్వరరావు, సీనియర్ వెయిట్ లిఫ్టర్స్ హర్షం ప్రకటించారు.

పేకాటలో ఐదుగురి అరెస్టు

ఏలూరుక్రైం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం బీడీ కాలనీ ఏటిగట్టుపై పేకాడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.23 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సూర్యభగవానుడికి అర్చనలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఆదివారం భక్తులు సామూహికంగా స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణశర్మ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపి రక్షాబంధనాలు కట్టి వనమూలికల తీర్థాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ కోరాడ రెడ్డి, బూరాడ పూర్ణచంద్రరావుల బృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.



మంత్రి గొట్టిపాటికి స్వాగతం

పెదపాడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు దెందులూరు నియోజకవర్గం తరపున పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పుష్పగుచ్ఛం అందజేసి ఆదివారం ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి స్వాగత పలికి అనంతరం ర్యాలీగా ఏలూరు నగరానికి పయనమయ్యారు. పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై మంత్రికి వినతి

ఉంగుటూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు విన్నవించారు. ఆదివారం ఏలూరు పార్లమెంటరీ నాయకత్వ సమావేశానికి హాజరైన సందర్భంగా మంత్రికి నియోజకవర్గంలోని ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాల్లో ఆక్వా రైతులపై అదనపు భారం పడుతోందన్నారు. అదనపు లోడును క్రమబద్ధీకరించాలని మంత్రిని కోరారు. నిడమర్రు మండలంలోని ఎనికేపల్లి గ్రామంలో విద్యుత్ ఉప కేంద్రాన్ని, చిన నిండ్రకొలను గ్రామంలో సబ్ స్టేషన్‌ను నిరించాలని కోరారు.



నిరసన తెలుపుతున్న కాపు సంఘ నాయకులు

భీమడోలులో నిరసన

భీమడోలు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కలిదిండి, సానారుద్రవరం గ్రామంలో వంగవీటి రంగా విగ్రహాన్ని అవమానించిన దోషులను కఠినంగా శిక్షించాలంటూ భీమడోలు గ్రామంలో కాపు నాయకులు నిరసన చేపట్టారు. భీమడోలు సంతమార్కెట్ సెంటర్‌లోని రంగా విగ్రహం వద్ద కాపుసంఘం నేతలు నిరసన తెలుపుతూ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నిందితుల్ని శిక్షించాలంటూ నినాదాలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ లైన్లు మారుస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జీవీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలో గల పల్లెవాడ, ఆలపాడు, సోమేశ్వరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు గమనించాలని కోరారు.

గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

చాట్రాయి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గణేష్ మండపాల ఏర్పాటుకు ఆయా కమిటీలు పోలీసు శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై డి. రామకృష్ణ తెలిపారు. గణేష్ విగ్రహాల ఏర్పాటు కమిటీలు వాట్సాప్ లింక్ ద్వారా అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులు ఇస్తామని, మండపాల వద్ద అన్ని రక్షణ చర్యలు చేపట్టాలని ఎస్సై కోరారు.

బార్ల లైసెన్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణ పరిధిలో నాలుగు బార్ల లైసెన్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య తెలిపారు. పట్టణంలో కొత్త బార్ పాలసీని దృష్టిలో పెట్టుకుని దరఖాస్తులు ఆహ్వానించటం జరుగుతోందని, మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. నాన్ రిఫండబుల్ ఫీజు కింద రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.10 వేలను ఆన్‌లైన్‌లో గాని, ఆఫ్‌లైన్‌లో గాని చెల్లించాలని, ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు కంటే ఎక్కువ వస్తేనే డ్రా తీయటం జరుగుతుందన్నారు. అలా రాని పక్షంలో నాన్ రిఫండబుల్ ఫీజును దరఖాస్తుదారులకు తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 94409 02462 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ముసునూరు మండలంలో ప్రవేశించిన సాగర్ జలాలు


వేంపాడు సాగర్ కాలువలో యూటీ రంధ్రాన్ని పూడ్చివేస్తున్న దృశ్యం

ముసునూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వేంపాడు శివారు భూములకు సాగర్ జలాలు అందించడమే లక్ష్యమని డీసీ ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ, వైస్ ఛైర్మన్ చలమాల వెంకటేశ్వరరావు అన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో వేంపాడు మేజర్ కాలువకు సాగర్ జలాలు విడుదల చేయగా ఆదివారం ముసునూరు మండలంలోకి ప్రవేశించాయి. మంత్రి ఆదేశాల మేరకు ఎన్ఎస్పీ డీఈఈ భవాని, ఏఈ వీరబ్రహ్మం పర్య వేక్షణలో టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, సొసైటీ డైరెక్టర్ వేంపాటి శ్రీనివాసరావు, నాయకులు కాటేపల్లి కేశవరావు, పొనగంటి వేణుల సహకారంతో కాలువలో ఉన్న యూటీ రంధ్రాలను పూడ్చి వేశారు. ఈ సంద ర్భంగా ఛైర్మన్ బాలకృష్ణ మాట్లాడుతూ మంత్రి పార్థసారథి తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి వేంపాడు మేజర్ కాలువకు నీటిని విడుదల చేయిం చారని, ప్రస్తుతం సూరేపల్లి గ్రామ పరిధి లోకి నీరు వచ్చిందన్నారు. అధికారుల పర్యవేక్షణలో నాయకుల సహకారంతో యూటీ రంధ్రాలను పూడ్చివేసినట్లు తెలిపారు. రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం సంతకాల సేకరణ



కలిదిండి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జీవో 30 ప్రకారం ఇరిగేషన్ భూముల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఆదివారం వ్యవసా య కార్మిక సంఘం ఆధ్వర్యంలో ముల్లంక, భాస్కరరావుపేట గ్రామాల్లో నివాసితుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడుతూ వందేళ్లుగా పెదలంక రెవెన్యూ డివిజన్‌లో వందలాది కుటుంబాలు స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాయని ఇప్పటి వరకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయకపోవటం అన్యాయమన్నారు. కలెక్టర్ స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివాసితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు వి.భాస్కరరావు, డీవీ సత్యనారాయణ, బి.నాగేంద్రరావు, కె.రజని, కొల్లి సతీష్, నక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీలో ప్రతిభ చూపారు


రంగ ప్రసాద్ | మోకా నాగరాజు | కృష్ణవేణి

కలిదిండి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో కలిదిండి మండలం కాళ్లపాలెం గ్రామానికి చెందిన మేడిశెట్టి రంగప్రసాద్ జిల్లాలో 5వ ర్యాంకు సాధించాడు. రంగ ప్రసాద్ తండ్రి రోజువారి కూలీ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, సర్పంచ్ పేటేటి స్వర్ణకుమారి రంగ ప్రసాద్‌కి అభినందనలు తెలిపారు. అలాగే చినతాడినాడ గ్రామానికి చెందిన మోకా నాగరాజు పీడీ పోస్టులో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 7వ ర్యాంక్ సాధించాడు. తల్లిదండ్రులు చనిపోయినప్పటికీ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువును అభ్యసించి 7వ ర్యాంక్ సాధించాడు.

మండవల్లి: మెగా డీఎస్సీ 2025 ఫలితాల్లో మండవల్లి మండలం చావలిపాడుకు చెందిన పల్లేడ కృష్ణవేణి సత్తా చాటారు. ఫిజికల్ డైరెక్టర్ విభాగంలో 88 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు.. రాష్ట్రస్థాయిలో మహిళా విభాగంలో రెండో ర్యాంకు సాధించారు. పాఠశాల స్థాయిలో ఆటలపై మక్కువ ఉండడంతో పెళ్లి అయిన పదేళ్ల తర్వాత ఇద్దరు చిన్నారులను ఇంటి వద్దనే వదిలి వ్యాయామ విద్యలో రెండేళ్ల డిగ్రీను సాధించారు. అనంతరం ఒంగోలులో కోచింగ్ తీసుకున్నారు. కృష్ణవేణిని పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, మండవల్లి వాసులు అభినందించారు.


ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ


గణపతి ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి: సీఐ

నూజివీడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలు జరిగేలా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టాలని, నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ సూచించారు. నూజివీడు మండల పరిధిలో గల వివిధ గ్రామాల్లోని గణేశ్ ఉత్సవ కమిటీల సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రజా రవాణా, వాహన రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా ఉండాలని, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలని, అనుమానాస్పద అంశాలు గుర్తిస్తే తక్షణం పోలీసుల దృష్టికి తీసుకురావాలని, భారీ విగ్రహాలు ఏర్పాటు చేసిన కమిటీలు సీసీ టీవీలను ఏర్పాటు చేయాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం, కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సై జ్యోతిబసు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సంగా

ఆగిరిపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆగిరిపల్లి మండల అధ్యక్షుడిగా సంగా రంగారావు ఎన్నికైనట్లు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శులు గాదె రాంబాబు, నగరపాటి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక ముక్తేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పార్టీ మండల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు తెలిపారు. రంగారావు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జిఆర్‌కె రంగారావు, నూజివీడు ఏఎంసీ ఛైర్మన్ కుంపటి అరుణ, నరసింగపాలెం బ్యాంక్ ఛైర్మన్ రామచంద్రరావు (ఎర్ర బాబు), రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకుడు దొడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


కలిదిండిలో రంగా విగ్రహం వద్ద రాధా, ఎమ్మెల్యే కామినేని


ఈడేపల్లిలో పోలీసుల బందోబస్తు


చాట్రాయిలో రంగా చిత్రపటానికి క్షీరాభిషేకం

దోషులను కఠినంగా శిక్షించాలి

- వంగవీటి రాధా
- కలిదిండిలో రంగా విగ్రహానికి ఎమ్మెల్యే కామినేనితో కలసి నివాళులు
- పలు చోట్ల రంగా విగ్రహావిష్కరణలు
- ఈడేపల్లిలో పోలీసు బందోబస్తు మధ్య విగ్రహాల ఆవిష్కరణ

కలిదిండి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అల్లర్లు సృష్టించటానికి రంగా విగ్రహాలపై దుశ్చర్యలకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలని రంగా తనయుడు వంగవీటి రాధా అన్నారు. ఆదివారం కలిదిండి, సానారుద్రవరం గ్రామాల్లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలసి రంగా విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేడ పూసిన రంగా విగ్రహాలకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాలాభిషేకం చేసి రంగా గౌరవం కాపాడినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ ఈ ఘటన సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లిందని దోషులను త్వరగా పట్టుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, జనసేన సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ నల్లగోపుల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఈడేపల్లిలో ప్రశాంతంగా విగ్రహాల ఆవిష్కరణ

ముదినేపల్లి: మండలంలోని ఈడేపల్లి గ్రామంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాలు పోటాపోటీగా ఏర్పాటు చేసిన రంగా విగ్రహాల ఆవిష్కరణ ఆదివారం పటిష్ఠ పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగింది. విగ్రహావిష్కరణకు ఆహ్వానితులైన ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణ తదితరులకు రంగా అభిమానులు, రాధా, రంగా మిత్ర మండలి సభ్యులు నిర్వహించిన స్వాగత ర్యాలీని కూడా పోలీసులు అణువణువునా పరిశీలిస్తూనే ఉన్నారు. ఈడేపల్లిలో కైకలూరు రూరల్ సీఐ రవి కుమార్ పర్యవేక్షణలో ముదినేపల్లి, కలిదిండి ఎస్ఐలు వీరభద్రరావు, వెంకటేశ్వరరావు, ముదినేపల్లి ఏఎస్ఐ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరువర్గాల నాయకులు బండి లీలా శంకర్, అబ్బిశెట్టి నాగబాబు పక్క పక్కనే రంగా విగ్రహాలను ఏర్పాటు చేయటంతో ఆవిష్కరణల సమయంలో ఆయా వర్గాలు శంకర్ జిందాబాద్, ఏఎన్ బాబు జిందాబాద్ అంటూ వారి అనుచరుల నినాదాలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వారించాల్సి వచ్చింది. రాధా మాట్లాడుతూ రంగాపై అభిమానంతో పోటాపోటీగా విగ్రహాలు పెట్టినట్లే ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని సూచించారు. విగ్రహాల ఆవిష్కరణలు ప్రశాంతంగా జరగటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రంగా చిత్రపటానికి క్షీరాభిషేకం

చాట్రాయి: కలిదిండి, సానారుద్రవరం గ్రామాల్లో కాపు ఉద్యమ నేత దివంగత వంగవీటి మోహనరంగా విగ్రహాలకు దుండగులు పేడపూసి అవమానించటం పట్ల చాట్రాయిలో కాపు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి, రంగా చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. నాయకులు కమ్ముల కొండలరావు, శ్రీరాముల సత్యనారాయణ, తుమ్మల రామారావు, కొల్లా శ్రీకాంత్, సవరం రామారావు, పసుపులేటి మహేష్, గాజుల ప్రశాంత్, పసుపులేటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రంగా అందరివాడు..

కైకలూరు: వంగవీటి మోహనరంగా ప్రజలందరి మనిషి అని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా అన్నారు. ఆదివారం ఆలపాడులో వంగవీటి మోహన రంగా విగ్రహావిష్కరణ ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాధా మాట్లాడుతూ రంగా పేదల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారని అన్నివర్గాల ప్రజల వ్యక్తిగానే గుర్తింపు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కలిదిండిలో రంగా విగ్రహాన్ని అవమానించిన వారిని వదిలే ప్రసక్తి లేదని వారి వెనుక ఎవరున్నా బయట పెడతామన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు సైతం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ బలహీనవర్గాల కోసం రంగా పాటుపడ్డారని, వారి గుండెల్లో రంగా చిరస్థాయిగా ఉంటారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, పైడిపాటి శివశంకర్, కొల్లి వరప్రసాద్, రాధా, రంగా అభిమానులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.


నిలిచిన కైకలూరు-3 సచివాలయ భవన నిర్మాణం


పునాదుల్లోనే నిలిచిన ముదినేపల్లి-1 సచివాలయం


పిచ్చిమొక్కల మధ్య అటపాక-2 భవనం

ఈ భవనాలకు మోక్షం ఎప్పుడో?

- రూ.లక్షలు వ్యయం... నెరవేరని లక్ష్యం
- అసౌకర్యాల నడుమ సచివాలయ ఉద్యోగులు

కైకలూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన సచివాలయ భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నాలుగేళ్లుగా ఈ భవనాలకు మోక్షం లేక బూత్ బంగ్లాలను తలపిస్తున్నాయి. కైకలూరు నియోజక వర్గంలోని కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి మండలాల్లో 79 సచివాలయాలు ఉండగా వీటిలో దాదాపు 40 సచివాలయ భవనాలు పూర్తి స్థాయిలో నిర్మాణం కాలేదు. వీటిలో కొన్ని పునాదుల దశలోనే నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో రూ.40 లక్షలు ఒక్కొక్క సచివాలయానికి కేటాయించగా కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.3.60 లక్షలు నిధులు అదనంగా మంజూరు చేసింది. దీంతో కైకలూరు-2, భుజబలపట్నం-1తో పాటు పలు గ్రామాల్లో భవనాలు పూర్తి చేశారు. మరికొన్ని భవనాలు తలుపులు, ఫ్లోరింగ్, విద్యుత్ సదుపాయాలను కల్పించవలసి ఉంది. కైకలూరు పట్టణంలో 5 సచివాలయాలకు 2 పూర్తి అయ్యాయి. మరో 3 రెండు అంతస్తుల భవనాలకు స్లాబులు వేసి వదిలివేశారు. అలాగే అటపాకలో రెండు సచివాలయాలకు గాను రెండు భవనాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. అలాగే మండలంలో మొత్తం 9 సచివాలయాలు పూర్తి కాలేదు. కలిదిండి మండలంలో 10 భవనాలు పూర్తి కాలేదు. వాటిలో మేజర్ పంచాయతీలు అయిన కలిదిండి, కోరుకొల్లు గ్రామాలకు నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆయా పాత పంచాయతీ కార్యాలయాల్లోనే అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే మండవల్లి మండలంలో మొత్తం 16 సచివాలయాలకు గాను 8 భవనాలు వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచి పోయాయి. ముదినేపల్లి మండలంలో 21 సచివాలయాలకు గాను 9 పూర్తి కాగా 6 అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ఇరుకు గదుల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు నిర్మాణం పూర్తయిన భవనాలకు బిల్లులు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం రూ.3.60లక్షలు పెంచినప్పటికీ పనులు ప్రారంభించక పోవడంతో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

వేధిస్తున్న నిధుల కొరత..

ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.40 లక్షలు ఉపాధి నిధులను సమకూర్చారు. కూటమి ప్రభుత్వం కూడా ఉపాధి నిధులను కొంతమేర మంజూరు చేసినా పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు భవన నిర్మాణాలను నిలిపివేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరితగతిన నిధులను విడుదల చేసి భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వివిధ ఆకృతుల్లో గణనాథులు



పూజలకు.. గణనాథులు సిద్ధం

ముదినేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చవితికి గణేష్ విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ముదినేపల్లిలో ఏళ్ల తరబడి వినాయక విగ్రహాల తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్న పెదగొన్నూరుకు చెందిన శిల్పి కలిదిండి పెద్దిరాజు వివిధ ఆకృతుల్లో విగ్రహాలను ఆకర్షణీయంగా రూపొందించారు. ఏలూరు, కృష్ణా జిల్లాతోపాటు పలు ప్రాంతాల నుంచి ఉత్సవాల నిర్వాహకులు విగ్రహాలకు ఆర్డర్లు ఇస్తున్నారు. ఈ కేంద్రంలో రూ.1500 నుంచి రూ.15 వేల వరకు విగ్రహాలను విక్రయిస్తున్నారు. ఎలుక వాహనం, నెమిలి వాహనం, నంది వాహనం, హంస వాహనంపై కూర్చున్న వినాయకుడి విగ్రహాలు, శివుడు ఎత్తుకున్న గణనాథుడు, శివపార్వతులతో వినాయకుడి విగ్రహాలు ఇలా వివిధ ఆకృతుల్లో విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.

పర్యావరణానికి హాని లేని విగ్రహాలు



పర్యావరణానికి హాని చేయని విధంగా విగ్రహాలు తయారు చేశాం. విగ్రహాల తయారీకి కొబ్బరి పీచు, వెంటనే కరిగిపోయే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కెమికల్స్ లేని వాటర్ పెయింట్స్‌ను వినియోగించాం. ఈ ఏడాది చవితికి వ్యాపారం ఆశాజనకంగానే ఉండే అవకాశాలున్నాయి.

-కలిదిండి పెద్దిరాజు, శిల్పి

మాకో.. ఛాన్స్ ప్లీజ్!

(5వ పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు నాయుడు ఇష్టమది. కొందర్ని వలస పక్షులుగా పేర్కొన్నా ముందు వెనుకా ఆలోచించే సీఎం నిర్ణయం తీసుకున్నారని, ఈ నిర్ణయాన్ని ఎవరు కాదనలేం ఖచ్చితంగా గౌరవించి తీరాల్సిందే.' మంత్రి పార్థసారథి అన్నారు. పార్టీ అధ్యక్ష ఎంపికలో ఏకాభిప్రాయం అవసర మని అందుకోసం ఈ తరహా సమావేశం ఏర్పాటు చేసిందని, వచ్చేసారి కూడా సీఎం చంద్రబాబు కొనసాగాలని ఆ మేరకు ఇప్పటి నుంచే కేడర్ యావత్తు పట్టుదలతో పనిచేయాలని మంత్రి సూచించారు. పార్టీ ఆదేశం మేరకు ఎవరైతే అధ్యక్ష స్థానాన్ని ఆశిస్తున్నారో అటువంటి వారి వివరాలన్నింటిని అధిష్ఠానంకు నివేదించేందుకే ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించారని, పార్టీ తీసుకునే నిర్ణయాన్ని అందరూ గౌరవించాల్సిందేనని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ అన్నారు. అందరూ కలిసి కట్టుగా ఉన్నాం. నిర్ణయాల్లోనూ ఇదే రకంగా ఉండాలి. పార్టీ క్రమశిక్షణకు ఇదెంతో ముఖ్యమని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. అందరం కలిసికట్టుగా వెళితేనే తెలుగుదేశం కుటుంబానికి కీర్తి, ప్రతిష్ఠ అని కైకలూరు నేత నర్శింహమూర్తి అన్నారు.

మాకు కావాలి.. మాకు కావాలి

తెలుగుదే శంలో పదవుల కోసం ఎవరంతటి వారుగా ఆదివారం జరిగిన సమావేశంలో పోటీలు పడ్డారు. పరిశీల కుల ఎదుట తమ బయోడేటాను సమర్పించడమే కాకుండా తమకున్న అర్హతలను ఏకరవు పెట్టారు. అధ్యక్ష స్థానానికి సుమారు 10 మందికి పైగా పోటీపడగా, అను బంధ సంఘాలు, జిల్లా పార్టీలోను మిగతా పదవులకు తాము అర్హులేమేనంటూ దరఖాస్తులు డజన్ల సంఖ్యలో అందజేశారు. ప్రస్తుతానికి అధ్యక్ష స్థానానికి మాత్రమే అభిప్రాయ సేకరణ జరుగుతుందని పదేపదే చెప్పినప్పటికి వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన వారంతా వివిధ పదవుల కోసం దరఖాస్తు అందించేందుకు వెనకడుగు వేయలేదు. పెద్ద సంఖ్యలో కేడర్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్, జెడ్పీ మాజీ ఛైర్మన్ కొక్కిరగడ్డ జయరాజు, అక్కిన నాగమణి, చింతల వెంకట రమణ,ఉండమట్ల సునీత, జగ్గవరపు ముత్తారెడ్డి, జయ వరపు శ్రీరామమూర్తి, రాష్ట్ర నాయకులు దాసరి ఆంజ నేయులు, షేక్ ముస్తఫా, రావోరి కృష్ణ, ఏలూరి హరిబాబు, కిలాడి వెంకట సత్యనారాయణ, ఉప్పాల జగదీశ్ బాబు,ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ పాల్గొన్నారు.

డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా

ఏలూరు అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సోమవారం నిర్వహించాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ వాయిదా పడింది. జిల్లాల వారీగా ఎంపిక జాబితాలు తయారైనప్పటికీ, వాటిని సాఫ్ట్‌వేర్‌లో మ్యాచ్‌చేసే ప్రక్రియ పూర్తికాకపోవడంతో జిల్లాల్లో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన వాయిదాకు కారణమని సమాచారం. ఉమ్మడి జిల్లా డీఎస్సీ సెలెక్టెడ్ అభ్యర్థులకు సోమవారం ఏలూరులో జరగాల్సిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామని, తదుపరి తేదీని మళ్లీ అభ్యర్థులకు తెలియజేస్తామని ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకటలక్ష్మమ్మ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన మంగళ లేదా బుధవారం జరిగే అవకాశం ఉంది.

లచ్చన్న, పాపన్నగౌడ్‌కు.. కామినేని, రాధా నివాళులు

ముదినేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని సర్దార్ గౌతు లచ్చన్న, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాలకు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోరాట యోధులు, స్వాతంత్ర్య సమర యోధులుగా ఇరువురూ చరిత్ర పుటల్లో నిలిచిపోయారని అన్నారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, చిగురుకోట సొసైటీ అధ్యక్షుడు చలసాని జగన్మోహనరావు, టీడీపీ బీసీ సెల్ మండల కార్యదర్శి వీరంకి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు

విదేశీ పత్తి దిగుమతిపై సుంకం రద్దు రైతాంగ వ్యతిరేక చర్య : హరనాథ్

చాట్రాయి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విదేశీ పత్తి దిగుమతులపై ఇప్పటి వరకు ఉన్న 11 శాతం సుంకాన్ని రద్దు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేయటం రైతాంగ వ్యతిరేక చర్య అని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి. హరనాథ్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం వాణిజ్య చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ముందుగానే సుంకాన్ని తగ్గించటం ఎవరిని ప్రసన్నం చేసుకోవటానికి అని ప్రశ్నించారు. ఈ చర్యతో దేశంలో పత్తి పండించే రైతులు తీవ్ర నష్టాలకు గురై అప్పుల ఊబిలో కూరుకుపోయేప్రమాదం ఉందన్నారు. బడా పత్తి దిగుమతిదారులకు ప్రయోజనాల కోసమే సుంకాలను తగ్గించారని ఆరోపించారు.



వైభవంగా నగరోత్సవం

నూజివీడు టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో శ్రీకృష్ణ భగవానుడికి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. కృష్ణం వందే జగద్గురుం అంటూ నగరోత్సవం సాగింది. టీడీపీ నూజివీడు పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్ ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, నూజివీడు కమిటీ అధ్యక్షులు అరుణ్‌కుమార్, సభ్యులు ఆంజనేయులు నాయక్, మద్దిరాల రవి, వంశీ, అశోక్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన పెద్దింటమ్మ ఆలయం

కైకలూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ఆవరణ కిక్కిరిసింది. మహిళలు ఆలయ ఆవరణలో పాల పొంగళ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు

ముదినేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పుట్టలో పాలుపోసి మహిళలు నాగ ప్రతిమలకు పూజలు జరిపారు. పలువురు మహిళలు పాల పొంగళ్లతో తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షణలో అర్చకులు తేలేటి వీరభద్ర శర్మ, రుద్రపాక బాలగంగాధర్ తిలక్ స్వామివార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

మండపాలకు గణనాథులు

నూజివీడు టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని గణనాథులు చలువ పందిళ్లకు చేరుతున్నారు. నూజివీడు పట్టణ, మండల ప్రాంతాల్లోని పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లల్లో గణేష్ చతుర్థి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో చలువపందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. చవితి మరో రెండురోజులు మాత్రమే ఉండటంతో ఒకరిని మించి మరొకరు భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి పందిళ్లను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.